www.trinetnews.com
# ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

సంపుటి 01 సంచిక 36 ఎడిటర్ :వెంకటేశ్వర్లు రాపోలు ఆదివారం సెప్టెంబర్ 13,2026 పేజీలు:12 వెల.10/-

### లాల్‌బాగ్‌చా ప్రసాద వ్యర్థాలు.. ఆ ఆస్పత్రులకు వెలుగునిస్తాయి..!


2లో



# గణేశ్ వేడుకలకు ఉచిత విద్యుత్

## దేశంలో ఎక్కడా లేని సౌకర్యం: సీఎం

- మండపాల వివరాలు పోలీసులకు ఇవ్వాలి
- నిమజ్జన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి
- క్రేన్ల ఏర్పాటుకు అనుగుణంగా చెరువుల అభివృద్ధి
- ఉత్సవాలు ముగిసే వరకు నిరంతర పర్యవేక్షణ
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం
- శాంతిభద్రతలకు విఘాతం లేకుండా చర్యలు
- హైదరాబాద్ ప్రశాంతంగా ఉంటేనే పెట్టుబడులు

హైదరాబాద్:
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేవంత్ రెడ్డి శనివారం వినాయక చవితి, నిమజ్జనం ఏర్పాట్ల సమీక్షలో పాల్గొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత సంప్రదాయాన్ని పునర్దుద్ధరించామని తెలిపారు. సమస్యలు తెలుసుకునేందుకు స్వయంగా తానే సమీక్ష నిర్వహిస్తున్నానని అన్నారు. “మండపాలకు అతిథులను ఆహ్వానిస్తే నిర్వాహకులు ఆ వివరాలు స్థానిక కమిషనరేట్ కు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నా. ఊహించని పరిణామాలు జరిగినపుడు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు ఆ సమాచారం ఉపయోగపడుతుంది. దేశంలో ఎక్కడాలేని విధంగా మన రాష్ట్రంలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. మండప నిర్వాహకులు సంబంధిత అధికారుల వద్ద దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ పొందాలి.



ఎక్కడెక్కడ మండపాలు ఏర్పాటు చేస్తున్నారో ముందుగానే సమాచారం అందిస్తే పోలీసులకు ట్రాఫిక్, బందోబస్తు నిర్వహణకు సులభంగా ఉంటుంది. అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మలకు ఏర్పాటు చేసినట్లే గణేశ్ నిమజ్జనాలకు అనుగుణంగా నిర్మాణ సమయంలోనే జాగ్రత్తలు తీసుకోవాలి. చెరువుల వద్ద చుట్టూ క్రేన్స్ ఏర్పాటుకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి.
ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణ చేయాలి. కమాండ్ కంట్రోల్ సెంటర్ లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకోవాలి. పర్యవేక్షణ, సమన్వయానికి ప్రత్యేక అధికారులను నియమించాలి. హైదరాబాద్ ప్రశాంతంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయి. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత్త వహించాలి. ఇందుకు నిర్వాహకుల నుంచి సహకారం ఉండాలి. సమస్యలు ఏమున్నా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది” అని రేవంత్ రెడ్డి తెలిపారు.

# హైదరాబాద్.. బ్లూ, గ్రీన్ సిటీగా!

- 30 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా పాలన
- మూసీ పునరుజ్జీవనానికి ?7,345 కోట్లు
- 20 టీఎంసీల గోదావరి జలాల తరలింపు
- జీహెచ్ఎంసీ మూడు కార్పొరేషన్లుగా విభజన
- సంస్థల సమన్వయానికి చట్టబద్ధ వ్యవస్థ
- మురుగునీటి శుద్ధితో కాలుష్య నివారణ
- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ లక్ష్యం
- ప్రపంచ నగరాలతో పోటీపడేలా హైదరాబాద్


2లో

# 22ఏ మా ప్రభుత్వం తీసుకురాలేదు

- 1999లోనే 22ఏ నిబంధన అమలు: పొంగులేటి
- అసైన్డ్, ప్రభుత్వ భూముల రక్షణకే 22ఏ
- 2016లో జీవో-121 జారీ
- 2017--2025 మధ్య 28,611 కేసులు పెండింగ్
- కొత్తగా ఏ భూమినీ 22ఏలో చేర్చలేదు
- 22ఏ జాబితాలో పొరపాట్లు జరిగాయి: మంత్రి
- రెండు రోజుల్లోనే తప్పులు సరిదిద్దాం
- నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లు పునఃప్రారంభం
- ఫేక్ జీవోలపై ఎఫ్ఐఆర్‌లు నమోదు




హైదరాబాద్:
22ఏ నిషేధిత భూముల అంశంపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 22ఏను తమ ప్రభుత్వం కొత్తగా తీసుకురాలేదని, 1999లోనే 22ఏ నిబంధన అమల్లోకి వచ్చిందని స్పష్టం చేశారు. అసైన్డ్, ప్రభుత్వ భూములను కాపాడుకునేందుకే 22ఏను తీసుకొచ్చారని తెలిపారు. 2015లో 22ఏ అంశంపై ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇచ్చిందని పొంగులేటి అన్నారు. కోర్టు ఆదేశాల మేరకు 22ఏ భూములను ఐదు కేటగిరీలుగా విభజించారని, అనంతరం 2016లో జీవో నంబర్ 121ను తీసుకొచ్చారని చెప్పారు. అయితే జీవో జారీ చేసినప్పటికీ అందుకు సంబంధించిన విధివిధానాలను ప్రకటించలేదన్నారు.

మిగతాద్ది 2 లో



## హెచ్ఎండీఏ పర్మిషన్ ఇస్తే.. హైడ్రా కూలగొడుతుందా?: కాంగ్రెస్ ఎమ్మెల్యే

హైదరాబాద్:
హైడ్రాపై కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు ప్రస్తుతం హైడ్రా అవలంభిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. ఒకవైపు హెచ్ఎండీఏ పర్మిషన్ ఇస్తుంటే.. మరొకవైపు హైడ్రా వచ్చి కూలగొడుతుందా? అని నిలదీశారు. “హెచ్ఎండీఏ పర్మిషన్ ఇస్తుంది.. హైడ్రా వచ్చి కూలగొడుతుంది” ఇదే ప్రస్తుతం జరుగుతుంది అంటూ అసహనం వ్యక్తం చేశారు.అసలు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోతే ప్రజల్లో విశ్వాసం కోల్పోతామన్నారాయన. హైడ్రా-హెచ్ఎండీఏల మధ్య సమన్వయం లేని కారణంగా పర్మిషన్‌లు ఇవ్వడం- ఆపై కూలగొట్టడమే జరుగుతుందంటూ ఆయన? వ్యాఖ్యానించారు.

2లో..

# మోదీని 21 సార్లు కలిశా


2లో

- » భారత్--చైనా కలిసి ముందుకు సాగాలి
- » ఆధునిక టెక్నాలజీతో వేగవంతమైన పురోగతి
- » పరస్పర సహకారంతో అభివృద్ధి
- » దీర్ఘకాలిక వ్యూహాత్మక ఒప్పందాలకు సిద్ధం
- » భారత్‌తో సంబంధాలు స్థిరమైన అభివృద్ధి బాటలో
- » చైనా సహకారానికి మోదీ కృతజ్ఞతలు
- » ద్వైపాక్షిక అంశాలపై మోదీ--జిన్‌పింగ్ చర్చలు




## ‘సేవా సంకల్ప్ అభియాన్’ 17 నుంచి: రామచందర్‌రావు

ప్రధాని మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 ఏళ్ల సుదీర్ఘ జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేసిన నేపథ్యంలో ‘సేవా సంకల్ప్ అభియాన్’ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ‘ప్రధాని మోదీ పాతికేళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకొని ఈ నెల 17న మోదీ పుట్టినరోజు నాటి నుంచి నెల రోజులపాటు దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం.

# ప్రశ్నిస్తే దాడులా?

- భయపెట్టాలని చూస్తున్నారా?
- ఏబీవీపీ నేతలపై పోలీసుల తీరుపై బండి సంజయ్ ఆగ్రహం
- అరెస్టు చేసిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి
- జీవో-9ను రద్దు చేయాలి
- పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి
- విద్యార్థులపై దాడులు దుర్మార్గం: బండి సంజయ్


2లో..

హైదరాబాద్:
ఏబీవీపీ కార్యకర్తల పట్ల పోలీసుల వ్యవహరించిన తీరుపై కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నించే వాళ్లపై దాడులు చేసి భయపెట్టాలని చూస్తారా? అని ప్రశ్నించారు. అరెస్టు చేసిన ఏబీవీపీ నేతలను విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయని కారణంగానే ఏబీవీపీ కార్యకర్తలు నిరసన చేపట్టారని, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రజాస్వామ్య పద్దతిలో నిరసన చేస్తే కాళ్ళు చేతులు విరగ్గొడతారా? అని నిలదీశారు.


## సుద్దాల అశోక్ తేజకు ‘తెలంగాణ తెలుగు తేజం’ పురస్కారం



తెలుగు భాషా సంరక్షణ సంఘం-తెలంగాణ సాహితీ సంస్థ ఏటా ప్రదానం చేస్తున్న రాష్ట్ర స్థాయి బుర్ర నర్సమ్మ-లింగారెడ్డి స్మారక ‘తెలంగాణ తెలుగు తేజం’ పేరుతో ఇచ్చే సాహిత్య పురస్కారం-2026కు ప్రముఖ కవి, జాతీయ సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ ఎంపికయ్యారు. ఈ మేరకు పురస్కార కమిటీ ఛైర్మన్, అవార్డు వ్యవస్థాపకుడు కెప్టెన్ డా.బుర్ర మధుసూదన్‌రెడ్డి, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం సేనాధిపతి శుక్రవారం ఒక ప్రకటనలో వివరాలు తెలిపారు. ఈ పురస్కార ప్రదానోత్సవం ఈ నెల 22న కరీంనగర్ పట్టణంలో నిర్వహించనున్నట్లు వివరించారు. తెలుగు భాషకు తెలంగాణ మట్టి బిడ్డలు చేసిన అమూల్య సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

### మా మామ భూములు ఉన్నది గజ్వేల్ లో..
## మంత్రి పొంగులేటికి హరీష్ రావు కౌంటర్

హైదరాబాద్:
బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరీశ్ రావు తన పరపతిని ఉపయోగించి వేల కోట్ల విలువైన ప్రభుత్వ, అసైన్డ్ భూములను అన్యాక్రాంతం చేశారన్న మంత్రి పొంగులేటి వ్యాఖ్యలకు హరీష్ రావు కౌంటర్ ఇచ్చారు. శనివారం (సెప్టెంబర్ 12) ఆయన తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ..


మిగతాది 2లో

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
ఆదివారం సెప్టెంబర్ 13,2026
www.trinetnews.com

# ప్రశ్నిస్తే దాడులా?

మొదటి పేజీ తరువాయి

'కాంగ్రెస్ సర్కార్‌కు పోయే కాలం దాపురించింది. ప్రశ్నించే వాళ్లపై దాడులు చేస్తూ భయపెట్టాలని చూస్తోంది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం. అరెస్ట్ చేసిన ఏబీవీపీ నేతలను విడిచిపెట్టాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి. జీవో నంబర్–9ను రద్దు చేయాలి. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి.
అధికార పార్టీ ప్రతిపక్ష పార్టీ, విద్యార్థి సంఘాలపై అమానుషంగా ప్రవర్తించడం దుర్మార్గం. విద్యార్థులని చూడకుండా ఇష్టరీతిన గొడ్డున బాదినట్లు చావగొడతారా?, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్యాల రాకేష్ తీవ్ర అస్వస్థత కాగా తోటి నాయకులు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. విద్యార్థి నాయకుడు అస్వస్థకు గురికాడారానికి కారణం పోలీసులు కాదా?, ఈ ఘటన చూస్తే అర్థం అవుతుంది పోరాడే విద్యార్థులపై ఏ రకంగా దాడి చేస్తున్నారో అనే విషయం. అరెస్ట్ చేసిన ఏబీవీపీ నాయకులను బేషరతుగా విడుదల చేయాలి' అని డిమాండ్ చేశారు.

# హైదరాబాద్‌ను బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం: శ్రీధర్‌బాబు

మొదటి పేజీ తరువాయి

నగరాన్ని బ్లూ సిటీ, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్ ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్ బిల్లును తెలంగాణ శాసనసభ లో మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో రవాణా కోసం కాంప్రిహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ చేశామని తెలిపారు. హైదరాబాద్ విస్తరణ పెద్దఎత్తున జరుగుతోందని, రాబోయే 30 ఏళ్ల అవసరాల దృష్ట్యా మరింత సమర్థంగా పాలన కోసం క్యూర్ చట్టం రూపొందించామని చెప్పారు.
"మూసీ పునరుజ్జీవం తొలిదశకు రూ.7,345.12 కోట్లతో అనుమతులు ఇచ్చాం. 20 టీఎంసీల గోదావరి జలాలు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాం. జీహెచ్‌ఎంసీని ట్రై కార్పొరేషన్లుగా విభజించుకున్నాం. అన్ని సంస్థలు సమన్వయంతో పనిచేసేలా చట్టబద్ధ వ్యవస్థను రూపొందించాం. సీఎం అధ్యక్షతన క్యూర్ అత్యున్నత పాలకమండలిని ఏర్పాటుచేస్తున్నాం. మహానగరపాలిక చట్టంలో సెక్షన్లు తగ్గించే ప్రణాళిక. మురుగునీటిని శుద్ధి చేసి చెట్ల పెంపకం, కాలుష్య నివారణకు వాడాలని ప్రభుత్వ యోచన. తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ రూపొందించుకుని ముందుకెళ్తున్నాం. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రపంచ నగరాలతో పోటీపడే స్థాయికి హైదరాబాద్ ఎదగాలి. పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించే స్థాయికి మనం చేరుకోవాలి. హైదరాబాద్ గత వైభవాన్ని కాపాడుకుంటూ భవిష్యత్ అవసరాలకు సిద్ధం చేయాలి" అని మంత్రి తెలిపారు.
తెలంగాణ ప్రజా విశ్వాసం నిబంధనల సవరణ చట్టం బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో చిన్నపాటి సాంకేతికపరమైన 400 రకాల నేరాలను.. నేరపూరిత పరిధి నుంచి తొలగించాలని మంత్రి శ్రీధర్‌బాబు సభలో బిల్లు ప్రవేశపెట్టారు. ఈ చట్టం ద్వారా వ్యాపార నిర్వహణ మరింత సులభతరమవుతుందని తెలిపారు. చాలా కేసుల్లో చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కేంద్రం తీసుకొచ్చిన ఈ చట్టం అందరికీ ఉపయోగపడాలని ఆలోచిస్తున్నామని చెప్పారు. ఈ చట్టాలకు సంబంధించి కలెక్టర్లు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టంచేశారు.

# 22ఏ మా ప్రభుత్వం తీసుకురాలేదు

మొదటి పేజీ తరువాయి

ధరణి తీసుకొచ్చే క్రమంలో కోర్టు ఆదేశాలను పక్కన పెట్టారని పొంగులేటి ఆరోపించారు. 2017 నుంచి 2025 వరకు 28,611 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ సమస్యల కారణంగా భూబాధితులు కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చిందన్నారు.నిషేధిత భూముల జాబితాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని కోర్టు ఆదేశించిందని మంత్రి తెలిపారు. కోర్టు సూచించిన నియమనిబంధనల ప్రకారం కమిటీని ఏర్పాటు చేసి, నిషేధిత జాబితాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచామని చెప్పారు.

### కొత్తగా ఏ భూమినీ 22ఏలో చేర్చలేదు

తమ ప్రభుత్వం కొత్తగా ఏ భూమినీ నిషేధిత జాబితాలో చేర్చలేదని పొంగులేటి స్పష్టం చేశారు. గతంలో ఉన్న భూములే ప్రస్తుతం నిషేధిత జాబితాలో ఉన్నాయని తెలిపారు.22ఏ జాబితాలో పొరపాట్లు జరిగిన విషయం వాస్తవమేనని అంగీకరించిన మంత్రి.. అధికారులు ఉద్దేశపూర్వకంగా గానీ, స్వలాభం కోసం గానీ ఆ తప్పులు చేయలేదన్నారు.జరిగిన పొరపాట్లను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన పరిష్కరించిందని పొంగులేటి తెలిపారు. మూడు విడతల్లో మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అధికారులతో చర్చలు జరిపామని చెప్పారు. సంబంధిత కాపీలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు.
కేవలం రెండు రోజుల్లోనే 22ఏకు సంబంధించిన పొరపాట్లను పరిష్కరించి రిజిస్ట్రేషన్లను తిరిగి ప్రారంభించామని మంత్రి వెల్లడించారు.

### ఫేక్ జీవోలపై ఎఫ్‌ఐఆర్‌లు

ప్రభుత్వం సమస్యను పరిష్కరించిన తర్వాతే ప్రతిపక్షాలు మేల్కొన్నాయని పొంగులేటి విమర్శించారు. ఫేక్ జీవోలను సృష్టించి ప్రజల్లో గందరగోళం సృష్టించారని ఆరోపించారు.నకిలీ జీవోలు సృష్టించిన వారిపై ఇప్పటికే ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశామని తెలిపారు. ఈ వ్యవహారంలో దళారుల వెనుక ఎవరున్నారో ప్రజలకు తెలుసని పొంగులేటి వ్యాఖ్యానించారు.

# హెచ్‌ఎండీఏ పర్మిషన్ ఇస్తే.. హైడ్రా కూలగొడుతుందా?: కాంగ్రెస్ ఎమ్మెల్యే

మొదటి పేజీ తరువాయి

' క్యూర్ ఏరియాలో అన్ని శాఖల మధ్య సమన్వయం అవసరం. ప్రతీ నెల సమన్వయ కమిటీ సమావేశం జరగాలి. ప్రభుత్వ శాఖలే పర్మిషన్ ఇచ్చి.. ప్రభుత్వ శాఖలే కూలగొడితే ప్రజలకు ప్రభుత్వం పై నమ్మకం పోతుంది. హైడ్రా, హెచ్‌ఎండీఏ మధ్య సమన్వయం అవసరం. ఇలా లేకపోతే హెచ్‌ఎండీఏ పర్మిషన్‌లు ఇవ్వటం, మరొకవైపు హైడ్రా వచ్చి కూలగొట్టడమే అవుతుంది' అని వ్యాఖ్యానించారు.

# ప్రధాని మోదీని 21 సార్లు కలిశా – చైనా అధ్యక్షుడు

మొదటి పేజీ తరువాయి

దిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చిన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ద్వైపాక్షిక అంశాలపై ఇరువురు చర్చలు జరిపారు. అనంతరం ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు.
అతిపెద్ద దేశాలుగా ఉన్న భారత్, చైనా కలిసి నడవాలని, ఆధునిక టెక్నాలజీ సాయంతో వేగంగా పురోగతి సాధించాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పేర్కొన్నారు. ఒకరి సామర్థ్యాల నుంచి మరొకరు నేర్చుకుంటూ, పరస్పర సహకారంతో ముందుకు సాగవచ్చని అన్నారు. భారత్‌తో దీర్ఘకాలిక, వ్యూహాత్మక ఒప్పందాలు చేసుకుంటామన్నారు. సదస్సుకు సంబంధించి తన పుట్టిన రోజునే భారత్ నుంచి ఆహ్వానం అందిందని జిన్‌పింగ్ గుర్తు చేశారు. ప్రధాని మోదీని ఇప్పటివరకు 21 సార్లు కలిశానని.. ఇరు దేశాల మధ్య సంబంధాలను స్థిరమైన అభివృద్ధి పథంలోకి నడిపించామని అన్నారు.
భారత్ అధ్యక్షతన జరుగుతోన్న బ్రిక్స్ సదస్సుకు చైనా అందించిన మద్దతు, సహకారానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు. ద్వైపాక్షిక సహకారంపై చర్చించేందుకు అవకాశం లభించిందన్న ఆయన.. వివిధ అంశాలపై చైనాతో చర్చించినట్లు పేర్కొన్నారు.

# విషాదం.. విమానం ఎగరడానికి కొన్ని గంటల ముందే..

ఓ స్టార్ హోటల్ రూమ్‌లో ఎయిరిండియా పైలట్ అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఢిల్లీలోని ప్రముఖ ప్రాంతమైన వసంత్ కుంజ్‌లో ఉన్న స్టార్ హోటల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, ఫ్లైట్ కెప్టెన్‌గా పనిచేస్తున్న ఆ వ్యక్తి ది గ్రాండ్ హోటల్లోని తన గదిలో అపస్మారక స్థితిలో కనిపించారు. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడిని సన్నీ అసల్దేకర్‌గా పోలీసులు గుర్తించారు. పైలట్ సెప్టెంబర్ 10న హోటల్‌లో చెక్–ఇన్ చేశారు. మరుసటి రోజు ఆయన ఫోన్




కాల్స్‌కు స్పందించకపోవడంతో ఆయన సోదరుడు హోటల్ మేనేజర్‌ను సంప్రదించాడు. దీంతో మేనేజర్ గదికి వెళ్లగా.. తలుపు లోపలి నుంచి లాక్ చేసి ఉంది. మాస్టర్ కీ సహాయంతో తలుపు తెరిచి చూడగా పైలట్ స్పందన లేకుండా కనిపించారు. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఆయనకు పోస్టుమార్టం నిర్వహించారు. మరణానికి కచ్చితమైన కారణం తెలియలేదు. పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్ వచ్చిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.
(శనివారం) తెల్లవారుజామున విధులకు ఆయన హాజరు కావాల్సి ఉంది. ఢిల్లీ నుంచి సియోల్‌కు వెళ్లే విమానాన్ని నడపాల్సి ఉంది. గుండెపోటు కారణంగానే ఆయన మరణించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నాయి. పైలట్ గతంలో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌లో పనిచేశారు. కొద్ది నెలల క్రితమే ఎయిర్ ఇండియాకు మారారు.

## ఏకపక్ష సుంకాలపై బ్రిక్స్ దేశాల ఆందోళన..

# దిల్లీ డిక్లరేషన్‌కు ఆమోదం

దిల్లీ డిక్లరేషన్ కు బ్రిక్స్ దేశాలు ఆమోదించాయి. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన వెలువరించారు. విభేదాలు పక్కన పెట్టి ఇరాన్ సహా యూఏఈ, సౌదీ అరేబియా ఈ డిక్లరేషన్‌కు ఆమోదం తెలిపాయి. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఇరాన్ , యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్య విభేదాలు నెలకొన్న విషయం తెలిసిందే. అయినప్పటికీ భారత్ దౌత్య నైపుణ్యంతో ఈ విషయంలో అన్ని సభ్య దేశాలు ఏకతాటిపైకి వచ్చాయి.
ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్ష సుంకాల విధింపుపై బ్రిక్స్ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమైన ఏకపక్ష నిర్బంధ చర్యలను ఖండించాయి. చర్చలు, దౌత్య మార్గాల ద్వారా




అంతర్జాతీయ వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవడానికి కట్టుబడి ఉన్నట్లు పేర్కొన్నాయి. ప్రపంచ దేశాల్లో అణ్వాయుధ, సంఘర్షణల ముప్పును ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాయి. అంతర్జాతీయ సవాళ్లను పరిష్కరించడంలో సహకారం ప్రాముఖ్యతను పునరుద్ఘాటించాయి. అంతర్జాతీయ శాంతి, స్థిరత్వానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపాయి. తీవ్రవాద కార్యకలాపాలను బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు తీవ్రంగా ఖండించింది. తీవ్రవాదం ఏ రూపంలో ఉన్నా అరికట్టాలని తెలిపింది. గతేడాది జమ్మూకశ్మీర్‌లో జరిగిన పహల్గాం ఉగ్రదాడిని నేతలు ఖండించారు. సీమాంతర ఉగ్రవాదం, తీవ్రవాద చర్యలను ఖండించిన నేతలు.. ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదన్నారు.

**రాత్రి 7.30గంటలకు మోదీ ప్రత్యేక విందు**

అనంతరం భారత్ ఇన్నోవేట్స్ ఎగ్జిబిషన్ సందర్శించిన బ్రిక్స్ దేశాల నేతలు.. అక్కడ ఫొటోలు దిగి మొక్కలు నాటారు. ఈ రాత్రి 7.30గంటలకు బ్రిక్స్ సదస్సుకు హాజరైన నేతలందరికీ ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక విందు ఇవ్వనున్నారు.

# లాల్‌బాగ్‌చా ప్రసాద వ్యర్థాలు.. ఆ ఆస్పత్రులకు వెలుగునిస్తాయి..!

ముంబయి లో అత్యంత ప్రాచుర్యం పొందిన లాల్‌బాగ్‌చా రాజా గణపతి నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమయ్యారు. 1934 నుంచి లాల్‌బాగ్‌చా మార్కెట్‌లో కొలువుదీరే ఈ గణనాథుడి వేడుకలు ఎంతో ఘనంగా జరుగుతాయి. ఇక్కడికి పెద్ద సంఖ్యలో సినీ, రాజకీయ ప్రముఖులు వస్తుంటారు. ఈ సారి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తోన్న బృహన్ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ కీలక ప్రకటన చేసింది. మండపం వద్ద ఆహార వ్యర్థాలను విద్యుత్‌గా మార్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపింది. నవరాత్రి సమయంలో ఈ మండపం వద్ద రోజుకు 8–10 టన్నుల సేంద్రియ వ్యర్థాలు పేరుకుంటాయి. ఆ వ్యర్థాలను బయో ఎలక్ట్రిసిటీ గా మార్చి, స్థానిక ఆస్పత్రులలో విద్యుత్ ఉత్పత్తికి వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు.





లాల్‌బాగ్‌చా రాజా సార్వజనిక్ గణేశోత్సవ్ మండలికి చెందిన సామూహిక వంటశాల నుంచి వచ్చే ఆహార, ప్రసాద వ్యర్థాలను సేకరించి.. స్థానిక నాయర్, కస్తూర్బా, జీటీబీ, సియాన్ ఆస్పత్రులలోని బయోమీథేనేషన్ ప్లాంట్‌లకు తరలించనున్నారు. ఈ వ్యర్థాల నుంచి దాదాపు 7,744 యూనిట్ల పునరుత్పాదక విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ విద్యుత్‌ను నాలుగు ఆస్పత్రులలోని ఇన్‌పేషెంట్ వార్డులు, కారిడార్లలో లైటింగ్ కోసం వినియోగించనున్నట్లు తెలిపారు.

**ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల రీసైకిల్..**

కృత్రిమ నిమజ్జన చెరువులు, తాత్కాలిక ట్యాంకులు, ఇతర జలాశయాలలో నిమజ్జనం చేసిన ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినాయక విగ్రహాలను మొట్టమొదటిసారిగా బీఎంసీ రీసైకిల్ ( చేయనుంది. ఈ విగ్రహాలను వెలికితీయడం, రీసైకిల్ చేయడం కోసం ఏర్పాట్లు చేస్తోంది. బాంబే హైకోర్టు ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రక్రియను నిమజ్జనం జరిగిన 24 గంటలలోపు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. వాటి నుంచి వచ్చిన వ్యర్థ పదార్థాలను విగ్రహాల తయారీ, ప్లాస్టర్ బోర్డులు, సిరామిక్స్, ఇటుకలు, సిమెంట్ పరిశ్రమలలో ఫిల్లర్ మెటీరియల్‌గా తిరిగి ఉపయోగించే అవకాశం ఉంది.

## మా మామ భూములు ఉన్నది గజ్వేల్ లో..

# మంత్రి పొంగులేటికి హరీష్ రావు కౌంటర్

మొదటి పేజీ తరువాయి

అసెంబ్లీలో మంత్రి పొంగులేటి అన్ని అబద్ధాలే చెప్పాడన్నారు. తెలంగాణవార్తలు 22ఏతో రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. 22ఏపై ప్రభుత్వ వైఫల్యాన్ని నిలదీస్తామనే భయంతోనే మమ్మల్ని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారని ఆరోపించారు. సభలో మేం లేకుండా చేసి పొంగులేటి పచ్చి అబద్ధాలు చెప్పారన్నారు. మేం అడిగిన ఒక్క ప్రశ్నకు పొంగులేటి సమాధానం చెప్పలేదని విమర్శించారు. అసలు ఎన్ని ఎకరాలు నిషేధిత జాబితాలో పెట్టారో ప్రభుత్వం చెప్పనే లేదని వ్యాఖ్యానించారు. రైతుల వ్యవసాయ భూములను పొరపాటుగా నిషేధిత జాబితాలో చేర్చామని అసెంబ్లీ సాక్షిగా పొంగులేటి ఒప్పుకున్నారు. కానీ ఇందుకు క్షమాపణలు చెప్పకుండా ఆయన తప్పించుకున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి నివాసం కూడా 22ఏలో ఉందన్నారు కదా.. ఆయన ఇళ్లను ఎప్పుడు తీసేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.

**మా మామ భూములు గజ్వేల్ లో ఉన్నయ్**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేటలో తన మామ పేరిట హరీష్ రావు అసైన్డ్ భూములు పట్టా చేసుకున్నారన్న మంత్రి పొంగులేటి ఆరోపణలను హరీష్ రావు ఖండించారు. తన మామ భూములు ఉన్నది సిద్దిపేటలో కాదని.. గజ్వేల్ నియోజకవర్గంలో ఉన్నాయని క్లారిటీ ఇచ్చారు. మా మామ ఒక రిటైర్డ్ బ్యాంక్ ఆఫీసర్ అని.. చెక్ ఇచ్చి లీగల్ గానే ఆయన భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వివరణ ఇచ్చారు.
మా మామ భూములు కొన్నప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉందని.. కావాలంటే అన్ని ఆధారాలు చూపించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. తాతముత్తాతల నుంచి వచ్చిన భూములను కూడా 22ఏలో పెట్టారని విమర్శించారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కొడుకు పేరు మీద ఎఫ్‌ఐఆర్ నమోదు అయితే రాత్రికి రాత్రే సీఐని మార్చాడని ఆరోపించారు.
పొంగులేటి ఆయన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు నాపై బురద జల్లుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశాడు. తన అవినీతి, అసమర్థతను ప్రశ్నిస్తున్నామన్న ఆక్రోశంతో అగ్గిపెట్టే రావు అంటూ పొంగులేటి అవమానించేలా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# 'సేవా సంకల్ప్ అభియాన్' 17 నుంచి: రామచందర్‌రావు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవం కూడా ఉన్నందున, ఆ రోజు సాయంత్రం హైదరాబాద్‌లో 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమంతో ఈ అభియాన్‌ను ప్రారంభిస్తాం. కృతజ్ఞతగా ప్రతి ఒక్కరూ ముఖ్యంగా కేంద్ర పథకాల లబ్ధిదారులు ఇళ్లలో దీపాలు వెలిగించి ఆశీర్వదించాలి. అనంతరం నెల రోజులపాటు రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్, వ్యాసరచన పోటీలు, 'మేరే సప్నో కా భారత్', 'సేవా జ్యోతి కలశ్ యాత్ర', 'సుశాసన్ సేవా సంవాద్' వంటి కార్యక్రమాలు నిర్వహిస్తాం. అక్టోబరు 2న మహాత్మాగాంధీ జయంతి వేడుకలను కూడా ఈ అభియాన్‌లో భాగంగా నిర్వహిస్తాం' అని రామచందర్‌రావు తెలిపారు.

## అన్నను కడసారి చూసేందుకు వచ్చి..

# అంత్యక్రియల్లో చెల్లెలి మృతి

తోడబుట్టిన అన్న మృతి చెందగా.. కడసారి చూసేందుకు వచ్చిన చెల్లెలు.. చివరికి అన్నతోనే తన జీవన ప్రయాణాన్ని ముగించింది. సోదరుడి అంత్యక్రియలు పూర్తికాకముందే ఆమె గుండె ఆగిపోయింది. యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరిలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటన స్థానికులను కలిచివేసింది.రాయగిరికి చెందిన కొత్త మల్లయ్య యాదవ్ శుక్రవారం మృతి చెందారు. అన్న మరణవార్త తెలుసుకున్న యాదగిరిగుట్ట మండలం దాతారుపల్లికి చెందిన చుక్కల వెంకమ్మ శనివారం రాయగిరికి చేరుకున్నారు. అన్న భౌతికకాయాన్ని చూసి తీవ్రంగా రోదించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ కన్నీరుమున్నీరయ్యారు. అన్నను కోల్పోయిన బాధను తట్టుకోలేక ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు విడిచారు. మల్లయ్య యాదవ్‌కు అంతిమ వీడ్కోలు పలుకుతున్న కుటుంబ సభ్యులకు.. కళ్లముందే వెంకమ్మ విగతజీవిగా కనిపించడంతో ఆ దుఃఖం రెట్టింపైంది. ఈ ఘటనతో రాయగిరి, దాతారుపల్లి గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# యాభై రెండేళ్ళ అరుణోదయలో

- **యాభై ఏళ్ళ విమలక్క ప్రస్థానం 50 గంటల పాటు ఏకధాటిగా పాటా-ఆటా-మాటలతో సాగే ప్రజా కళా జాతర**
- **కరపత్రాన్ని నేడు ప్రజా కళా జాతర ఆహ్వాన సంఘం కమిటీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్, హైదరాబాద్ లో ఆవిష్కరించడం జరిగింది.**



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 12** నుంచి ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయదీర్ తిరుమలరావు,ఆచార్య కట్టా భగవంత రెడ్డి, ప్రొఫెసర్ లక్ష్మి, అరుణోదయ విమలక్క, పట్లోళ్ల నాగిరెడ్డి,మల్లేష్, మన్నారపు నాగరాజులు మాట్లాడుతూ...

ఈ నెల 26-27-28 (సెప్టెంబర్)2026 తేదీలలో 50 గంటల పాటు ప్రజా కళాజాతర హైదరాబాద్ లోని ఆర్టీసి కళ్యాణ మండపం,(అరుణోదయ నాగన్న ప్రాంగణం)బాగ్‌లింగంపల్లి యందు నిర్వహించ బడుతుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

నేటి ఢిల్లీ జంతర్ మంతర్ పోరాటం జనతా మంత్రమై దేశవ్యాప్తంగా విద్యార్థి- యువతను కదిలిస్తున్నట్లే,1960-70 ల కల్లోల దశాబ్దంలో నక్సల్బరి-శ్రీకాకుళం-గోదావరిలోయ విప్లవోద్యమాలు అరుణోదయ ఏర్పాటుకు ప్రేరణ నిచ్చాయన్నారు. సహజంగానే విప్లవోద్యమాలు విప్లవ కవులను-కళాకారులను సృష్టించుకుంటాయి.కానీ అలాంటి విప్లవ ప్రజా సాంస్కృతికోద్యమాల్లో చివరికంటా నిలబడే వాళ్ళు అరుదుగా ఉంటారన్నారు.అలాంటి అరుదైన వ్యక్తుల్లో విమలక్క ఒకరన్నారు. ఇంట్లో నుండే తండ్రి, అమరుడు,తెలంగాణ సాయుధ పోరాట వీరుడు కామ్రేడ్ బండ్రు నర్సింహులు పోరాట వారసత్వాన్ని ఆమె అందుకుందన్నారు. ఎనిమిది పదులు దాటి కనుమూసిన తల్లి బండ్రు నర్సమ్మ కాయకష్టాన్ని, ఆత్మీయ ప్రేమలను పుణికిపుచ్చుకుందన్నారు. విప్లవ కార్యకర్త,కవి కామ్రేడ్ మిత్ర జీవిత సహచర్యం ఆమె విప్లవ ప్రజా కళా జీవితానికి తోడయ్యిందని,వందలాది మంది అమరుల త్యాగాలు ఆమెను ఆగిపోకుండా వెన్నుతట్టి ముందుకు నడిపించా యన్నారు.ఇంటి పక్క పొలంలో నాట్ల పాటలు, ఇంటి ముందు బతుకమ్మ ఆటా-పాటలు బాల్యం నుండే ఆమెను గాఢంగా ప్రభావితం చేశాయన్నారు. ఒగ్గు,ఢమరుకం శబ్దంతో కథా గానమైనా,పీరీల ఆటలైనా-పాటలైనా, బాలసంత గంటల మేలుకొలుపులైనా,చిందు బాగోతాలైనా,శారద వీణపై పలికిన కమ్యూనిస్టు చింతలాపుడి రాంరెడ్డి కథయినా,బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న వీరగాథైనా, కిన్నెరపై పలికిన పండుగల సాయన్న సాహస గాథయినా విమలక్కనే కాదు, తెలంగాణ కవి గాయకులెందరినో ప్రభావితం చేశాయన్నారు. తెలంగాణ ప్రజా కళలు, జానపదాలు విప్లవతత్వంతో తెలంగాణ సమాజాన్ని విడదీయలేనంతగా పెనవేసుకున్నాయన్నారు. అందుకే విమలక్క తన జీవితంలో విప్లవ గేయాలను గద్దర్ లాగా ప్రదర్శన స్థాయికి తీసుకురాగలిగిందన్నారు. బుర్రకథ,ఒగ్గు కథ,భూమి బాగోతం,బతుకమ్మ, కోయ-గోండు నృత్యాలు, ప్రత్యేకించి సిగ్నేచర్ డ్యాన్సులో డప్పు కళాకారుల నృత్యం లాంటివి ఎన్నో ఆమె ప్రదర్శనలలో భాగమై ఉన్నాయి.ఇవే నేటి ప్రజా కళాజాతరకు ప్రేరణ అన్నారు.

50 ఏళ్ల కాలంలో విమలక్క పాడిన పాటలన్నీ పాడుతూ ఆమెతో గొంతు కలుపుదాం.తద్వారా ప్రజా ఉద్యమాలతో మమేకమౌదాం.విమలక్క ఆడిన ఆటలకు పాదం కలుపుదాం.తద్వారా ప్రజా ఉద్యమాల సంస్కృతిక సారథులుగా నిలబడుదాం.విమలక్కనే కాదు మొత్తం తెలుగు సమాజాన్ని,భారతదేశాన్నిఉర్రూతలూగించిన జానపద సంపదతో, లెక్కలేనన్ని కళారూపాలతో మమేకమౌదాం. అంతరించే దశలో ఉన్న వాటిని తట్టి లేపుదాం. అనాధరణకు గురవుతున్న వాటిని ఆదరిద్దాం.అందుకే విమలక్క యాభై ఏళ్ల పాటు పాడుతున్న విప్లవ పాటలు,కుల హక్కుల పాటలు,సామాజికోద్యమ పాటలు,పర్యావరణ పాటలు,అమరుల స్మృతి గీతాలు,స్త్రీ విముక్తి గీతాలు,ఆదివాసీ స్వయం పాలనా పాటలు, బృందగానాలు అన్నీ కలిసి పాడుదాం. కార్పోరేటీకరణ, మనువాదాలు కవల పిల్లలై సాగిస్తున్న దాడులను నిరసిస్తూ ఆమె పాడిన పాటలతో, వర్తమానంలో సాగుతున్న ఉద్యమాలతో మమేకమవుదాం.

ప్రజా కోణం నుండి ప్రదర్శించబడుతున్న సకల నృత్య రీతులు, కళారూపాలు అన్నీ ప్రదర్శిద్దాం.అదే సమయంలో ఆమె ప్రదర్శించిన బుర్రకథ, ఒగ్గు కథ, బ్యాలే,నృత్య నాటిక మొదలుకొని అన్ని మనమే మళ్ళీ ప్రదర్శన చేద్దాం.తెలుగు నేలపై ప్రత్యేకించి కళల కాణాచిగా తెలంగాణలో ఉదయించిన అన్ని కళల ప్రదర్శనకు 50 గంటల పాటు ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం."ప్రజా కళా జాతర"లో భాగస్వామ్యం కావడానికి అందరినీ సాదరంగా ఆహ్వానిస్తున్నాం.ఈ కార్యక్రమం ఆద్యంతం రికార్డు చేసి ప్రజలకు అందించబడుతున్నందున తాము పాడే పాటలను, కళారూప ప్రదర్శనలను ముందుగా కార్యక్రమ నిర్వాహకులతో నమోదు చేసుకోవాలని తద్వారా సమన్వయం చేసుకోవాలని కోరుతున్నాం.ఇది కేవలం 50 పాటల కార్యక్రమం మాత్రమే కాదు.50 మంది ఉపన్యాసకుల విశ్లేషణలు,50 అనుభవాల మేళవింపు కార్యక్రమం.అలాగే ఇక్కడ విమలక్క పాటల ప్రదర్శనలే కాదు, తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ లతో పాటు నలుమూల నుండి వచ్చే బహుళ ప్రజా కళలు, జానపద కళారూపాలు అన్నీ ప్రదర్శించబడే ప్రజా కళా జాతర.మనువాద సంస్కృతి మూఢత్వమై, సామ్రాజ్యవాద సంస్కృతి విశృంఖల దోపిడితత్వమై సాగిస్తున్న దాడికి వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతి నిర్మాణంలో భాగమయ్యే సంస్థలను, శక్తులను,వ్యక్తులందరినీ సాదరంగా ఆహ్వానిస్తున్నాం.విప్లవ ప్రజా సాంస్కృతిక శక్తుల ఐక్యతను కాంక్షిస్తున్నాం. అరుణోదయ విమలక్క ఒక వ్యక్తి కాదు, సామూహిక శక్తి.1974 మే 12న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాలలో పురుడు పోసుకునేటప్పటికే బాల గాయనిగా అడపాదడపా ఆమె తండ్రి వేలు పట్టుకుని వెల్తూ ప్రజావేదికలపై పాడుతున్నారు. అరుణోదయ ఆవిర్భావం తర్వాత ఆలేరుకు వచ్చిన అరుణోదయ ప్రచార బృందంతో కలిసి క్యాంపెయిన్ లో పాల్గొన్నారు.ఎమర్జెన్సీలో జైల్లో ఉన్న తండ్రి కామ్రేడ్ బండ్రు నర్సింహులును చూడడానికి పోయినప్పుడు కాశీపతి, హెచ్ ఆర్కె,వరవరరావు తదితరులు ఆమెతో జైల్లోనూ పాటలు పాడించుకున్నారు. 1976లో కామ్రేడ్ జంపాల స్మృతిలో గూడ అంజన్న రాసిన పాటను రాంసత్తయ్య ద్వారా నేర్చుకొని పాడే నాటికే విమలక్కకు 12 ఏళ్ళు నిండాయి.వాస్తవంగా 2016లో టిపిఎస్‌కె, నటరాజ కళానికేతన్‌లు కల్సి విమలక్క 45 ఏళ్ళ పాటల ప్రస్థానం సభ జరిపారు.అందులో గద్దర్ పాల్గొన్నారు.

అయితే విమలక్కకు కానూరి వెంకటేశ్వరరావు, రాంసత్తన్న లాంటి గురువులు,రామారావు, నాగన్న,రాజేంద్రప్రసాద్, అంబిక,ప్రొ. వినయ్ బాబు,వీరన్న,కరుణ, గంగ,ఉష,దేవి,చైతన్య, జయ,బాల్‌నర్సయ్య, చందర్ రాములు, రాయికృష్ణ లాంటి ప్రజా కళా యోధుల సహచర్యం ఒక ఎత్తయితే,విమలక్క శక్తి అంతా బృందగానం. విద్యార్థినిగా పిడిఎస్‌యు లో చేరి భువనగిరి డిగ్రీ కళాశాల సాంస్కృతిక కార్యదర్శిగా గెలిచింది. పీఓడబ్ల్యూ (స్త్రీ విముక్తి) నల్లగొండ జిల్లా అధ్యక్షురాలిగా, రాష్ట్ర కోశాధికారిగా ఎన్నో మహిళా ఉద్యమాలకు నాయకత్వం వహించింది. అయినా విమలక్క ప్రధాన చిరునామా మాత్రం అరుణోదయనే. ఆమె ప్రధాన కృషి అంతా ప్రజా సాంస్కృతిక ఉద్యమ గానమే.ఈ కృషిలో సంస్థతో పాటు, తన బృందం యొక్క శక్తి విమలక్క ద్వారా సమిష్టిశక్తిగా ప్రదర్శితమవుతుంది. అందులో కంజెర,డప్పు, డోలు,గజ్జెలు,ఒక్కోసారి పిల్లనగ్రోవి అన్ని వాయిద్యాలు తోడై బలమిస్తాయి.తన బృందంతో ఢిల్లీ,ముంబై, కలకత్తా,బెంగళూరు, చెన్నై,లక్నో,రాంచి, లాంటి మహానగరాలతో పాటు గోవా, కళింగ నగర్, (ఒరిస్సా), జాజా (బీహార్), బిలాయి (ఛత్తీస్ గడ్) త్రిశూర్ (కేరళ), జలంధర్ (పంజాబ్) లాంటి ఉద్యమ ప్రాంతాలన్నీ తిరిగారు. అమెరికా,మలేషియా లాంటి దేశాల తెలుగు సంఘాలతో ఎన్నో జూమ్ మీటింగ్‌లో మాట్లాడారు. 1995లో తిరుపతి, 1995లో హైద్రాబాద్, 2004లో ముంబై, 2014లో హైద్రాబాద్ అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లలో తన బృందంతో ప్రదర్శనలిచ్చారు. బహుజన బతుకమ్మను తలకెత్తుకుని 15 ఏళ్లుగా తెలంగాణ చుట్టిరావడంతో పాటు, ఖతార్ వెళ్లి బతుకమ్మ ఉద్యమ సందేశం వినిపించారు.తన ప్రస్థానంలో డజన్ల కొలది పాదయాత్రలు, అరెస్టులు, కేసులు, జైళ్లే కాకుండా ప్రజల మన్ననలందుకున్న సత్కారాలు, అవార్డులు ఉన్నాయి. ఆమెపై నిర్బంధాన్ని ఖండిస్తూ పలు పుస్తకాలు వచ్చాయి. ప్రజా ఉద్యమ అవసరాల్లో విమలక్క రాసిన వ్యాసాలతో పాటు, ఇంటర్వ్యూలు, పోడ్ కాస్టులకు లెక్కేలేదు. ఆమె కళా ప్రదర్శనలను, వ్యక్తిత్వాన్ని విడమర్చి చెప్పే వ్యాసాలున్నాయి. పలు వాఖ్యానాలున్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆమె పాటా-అటా-మాటా అన్నింటికి మించి మిలిటెంట్ పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయి.అవన్నీ గుది గుచ్చి ఒక దగ్గరకు చేర్చే ప్రయత్నం చేస్తున్నాం.ఈ కృషిలో విమలక్క తన జీవితాన్ని ప్రజలకంకితం చేసి బతుకొచ్చని నిరూపించారు.అలాంటి అంకిత స్వభావం గల కార్యకర్తలను,ప్రజా కళాకారులను తీర్చిదిద్దుకోవడానికి విమలక్క ప్రస్థానం స్ఫూర్తిదాయకం కావాలని ఆశిస్తున్నాం.50 గంటల పాటు సాగే ఈ ప్రజా కళా జాతర నిర్వహణ కమిటీలో స్వచ్చంధంగా భాగం కావాలని ఆయా సంస్థలను,శక్తులను, వ్యక్తులను సవినయంగా కోరుతున్నాం.ఈ సందర్భంగా "అరుణోదయ విమలక్క ప్రజా సాంస్కృతికోద్యమ ప్రస్థానం విప్లవ సాంస్కృతికోద్యమ "దశా-దిశ" అనే పుస్తకాన్ని వెలువరిస్తున్నాం. వందలాది మంది కవులు -కళాకారులు, విద్యావేత్తలు,న్యాయ కోవిదులు, హక్కుల కార్యకర్తలు, ప్రజా వైద్యులు, కుల నిర్మూలనా వాదులు, జర్నలిస్టులు ప్రజా సంఘాల ప్రతినిధులు, ప్రజాస్వామిక- అభ్యుదయ శక్తులంతా ఈ ఆహ్వానసంఘంలో భాగస్వాములే.ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ఆర్థికంగా, హార్దికంగా సహకరించా లని విజ్ఞప్తి చేస్తున్నాం.

ఈ కార్యక్రమంలో... అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతుల రమేష్, సహాయ కార్యదర్శి రాకేష్, ఉపాధ్యాయ దర్శిని పత్రిక పూర్వ సంపాదకులు ప్రకాష్ రావు,ూూూా పాండు నాయక్, ూ×ఖీఖ నాయకులు యాకయ్య, రైతు-కూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి వెంకటేశ్వరరావు,ూణూఖ (విజృంభణ)
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్,ూ×ఖీఖ ప్రధాన కార్యదర్శి అంజయ్య, ఒగ్గు రవి,వెంకటేష్, రాజేష్,సౌమ్య,శ్రీలత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.
ప్రజా కళా జాతర ఆహ్వాన సంఘం.

# విజయ డెయిరీని బలోపేతం చేసి పాడి రైతులకు అండగా నిలుస్తాం

- **పాల సేకరణలో తాత్కాలిక తగ్గుదల..**
- **పాడి రైతులకు ఎలాంటి బకాయిలు లేవు**
- **నాణ్యమైన పాల ఉత్పత్తులు, మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి**
- **డిమాండ్ కు సప్లై కు మధ్య ఉన్న వ్యత్యాసం తగ్గిస్తాము**
- **శాసనమండలి లో మంత్రి వాకిటి శ్రీహరి**



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12 :** విజయ డెయిరీని మరింత బలోపేతం చేసి పాడి రైతులకు అండగా నిలిచేందుకు ప్రజా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య శాఖల మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. శనివారం శాసనమండలిలో విజయ డెయిరీ పాల సేకరణకు సంబంధించిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. విజయ డెయిరీ పాల సేకరణలో తాత్కాలికంగా స్వల్ప తగ్గుదల నమోదైందని మంత్రి తెలిపారు. దీర్ఘకాలంగా కొనసాగిన లీన్ సీజన్ కారణంగానే ఈ తగ్గుదల ఏర్పడిందని వివరించారు.
గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో విజయ డెయిరీ రోజువారీ సగటు పాల సేకరణ వివరాలను మంత్రి వెల్లడించారు. ఏప్రిల్ 2023 -- మార్చి 2024: రోజుకు 3.60 లక్షల లీటర్లు, ఏప్రిల్ 2024 -- మార్చి 2025: రోజుకు 4.00 లక్షల లీటర్లు,
ఏప్రిల్ 2025 -- మార్చి 2026: రోజుకు 3.36 లక్షల లీటర్లు అని తెలిపారు. పాడి రైతుల సంక్షేమం, విజయ డెయిరీ బలోపేతం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి వివరించారు. పాడి రంగంలో రైతులకు మరింత భరోసా కల్పించడంతో పాటు విజయ డెయిరీని ఆధునికీకరించడం, పాల ఉత్పత్తుల మార్కెటింగ్‌ను పెంచడం, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించడం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. పాడి రైతులకు చెల్లించాల్సిన పాల సేకరణ బకాయిలు ఏవీ లేవని మంత్రి స్పష్టం చేశారు. రైతుల నుంచి సేకరించిన పాలకు సంబంధించి ప్రభుత్వం, విజయ డెయిరీ చెల్లింపుల విషయంలో ఎలాంటి బకాయిలు లేవని పేర్కొన్నారు.
తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని పాడి రైతులకు దేశంలోనే అత్యధిక ధర చెల్లిస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వం కృత్రిమ పన్నీరు ను నిషేదించిందని,విజయ డైరీ కేవలం పాలతో తయారు చేసే పన్నీరును విక్రయిస్తోందని తెలిపారు. విజయ డైరీకి ఆదాయం పెంచే విధంగా ఆయా స్థలాల్లో పెట్రోల్ బంక్ లు , షాపింగ్ కాంప్లెక్స్ లు నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. పశు వైద్య శాఖ లో 110 మంది డాక్టర్ లను 304 కాంపౌండర్లను నియమించామని వివరించారు.
రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి పాడి గేదెలను పంపిణీ చేసి పాల ఉత్పత్తులను పెంచేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.డిమాండ్ కు సప్లై కి మధ్య వ్యత్యాసం తగ్గిస్తామని మంత్రి స్పష్టం చేశారు. పాడి రైతుల ప్రయోజనాలే ప్రజా ప్రభుత్వానికి ప్రాధాన్యత అని, విజయ డెయిరీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం కొనసాగిస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

# నాగపూర్- వరంగల్ గ్రీన్ ఫీల్డ్ హైవే త్వరలోనే పూర్తి చేస్తాం

- **రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**

**హైదరాబాద్, ట్రినెట్ న్యూస్, సెప్టెంబర్ 12:** నాగపూర్- వరంగల్ గ్రీన్ ఫీల్డ్ హైవే త్వరలోనే పూర్తి చేస్తామని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి
అన్నారు. శనివారం శాసన మండలిలో సభ్యులు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ప్రొ.కోదండరామ్ అడిగిన ప్రశ్నలకు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి సమాధానం ఇచ్చారు.
పర్కాల్ ప్రాంతానికి దగ్గరగా ఎగ్జిట్ ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఈ విషయంపై ఎన్‌హెచ్‌ఏ అధికారులకు రేపే ఆదేశాలు ఇచ్చి, ప్రజలకు సౌకర్యంగా ఉండేలా ఏర్పాటు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. నాగ్‌పూర్--మంచిర్యాల--వరంగల్--ఖమ్మం--విజయవాడ హైవే చాలా ముఖ్యమైన రహదారి అని మొత్తం 310 కిలోమీటర్ల పొడవు ఉన్న ఈ ప్రాజెక్టులో 280 కిలోమీటర్లు తెలంగాణలోనే ఉన్నాయని మంత్రి వివరించారు. ఈ రహదారి నాలుగైదు జిల్లాలను కలుపుతూ, తెలంగాణ నుంచి నాగ్‌పూర్, విజయవాడ వైపు ప్రయాణించే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. మంచిర్యాల--వరంగల్ రహదారిని ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలిచారు. 2023 మార్చి




31న ఎల్ఓఏ ఇచ్చి, మే 23న అగ్రిమెంట్ జరిగిందని,, మొదట 730 రోజుల్లో, అంటే రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే భూసేకరణ, కోర్టు కేసులు, ఇతర కారణాల వల్ల పనుల్లో ఆలస్యం జరిగిందన్నారు. భూసేకరణలో సమస్యలు పరిష్కరించాం. చిన్నచిన్న సమస్యలతో కొంత భూమి మాత్రమే పెండింగ్‌లో ఉందని, దానిని కూడా త్వరలో పరిష్కరిస్తామన్నారు.
ఆలస్యం కారణంగా కాంట్రాక్టర్‌కు ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్ ఇచ్చి, 31-12-2027 నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని నిర్ణయించామని తెలిపారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కూడా మే 26న ఈ ప్రాజెక్టుపై ప్రత్యేకంగా రివ్యూ చేశారన్నారు. తెలంగాణకు ఈ రహదారి ఎంత ముఖ్యమో, ముఖ్యంగా నాగ్‌పూర్‌కు వెళ్లే ప్రజలకు ఎంత ఉపయోగకరమో ఆయన స్పష్టంగా చెప్పారని మంత్రి తెలిపారు. భూసేకరణ విషయంలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగదు. వారికి మార్కెట్ రేట్ ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
కోదండరామ్ లేవనెత్తిన భూసేకరణ సమస్యలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ప్రస్తుతం ఒకటి రెండు చోట్ల మాత్రమే భూమి అప్పగింత పెండింగ్‌లో ఉంది. ఒకచోట సుమారు 1 నుంచి 1.30 కిలోమీటర్లు, మరో ప్యాకేజీలో 5.7 కిలోమీటర్ల మేర సమస్య ఉందని, దాన్ని కూడా త్వరలో పరిష్కరిస్తామన్నారు. భూసేకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది కాగా, నిర్మాణ పనులు మొత్తం ఎన్హెచ్ఏఐ ఆధ్వర్యంలో జరుగుతున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం నోడల్ ఏజెన్సీగా ఎన్హెచ్ఏఐ కి పూర్తి సహకారం అందిస్తోందని చెప్పారు.
ఎన్హెచ్ఏఐ అధికారులతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు ఇస్తామన్నారు. 31 డిసెంబర్ 2027 నాటికి ఈ కీలక రహదారి ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని
మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి హామీ ఇచ్చారు.

# "విద్య పుస్తకాలకే పరిమితం కాదు;






**హైదరాబాద్ , ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ ,12.**
"విద్య పుస్తకాలకే పరిమితం కాదు; అనుభవాల ద్వారా సంప్రదాయాలను, విలువలను, సంస్కృతిని పిల్లలకు చేరువ చేయడమే నిజమైన విద్య."
ఈ ఆలోచనకు అనుగుణంగా సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ చైర్మన్ జగదీశ్వర్ , డైరెక్టర్ డా. సుమన్ కుమార్ , ప్రిన్సిపల్ డా. వినయశ్రీ , వైస్ ప్రిన్సిపల్ శ్రీమతి ప్రియాంకా ధూబే మార్గదర్శకత్వంలో గ్రాండ్ పేరెంట్స్ డే సందర్భంగా మట్టి వినాయక ప్రతిమల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి తాతయ్యలు, అమ్మమ్మలు, నానమ్మలు ఎంతో ఉత్సాహంగా హాజరయ్యారు. కొందరు దూర గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా వచ్చి తమ మనవళ్లు, మనవరాళ్లతో కలిసి మట్టితో అందమైన వినాయక ప్రతిమలను ఎంతో ఆనందంగా తయారు చేశారు.
పిల్లల ఉత్సాహాన్ని మించి పెద్దలు చూపిన ఆనందం, ఆసక్తి అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమం ద్వారా పిల్లలు సంప్రదాయం, సృజనాత్మకతను అనుభవిస్తూ నేర్చుకోవడంతో పాటు, తమ తాతయ్యలు, అమ్మమ్మలు, నానమ్మలతో ప్రేమ, ఆప్యాయతలతో కూడిన మధురమైన జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమం అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే అనుభూతిగా నిలిచింది.

# బీఆర్ఎస్ నేతల భూ దందాల భాగోతం బహిర్గతం చేస్తాం : ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్12:** 22ఏ సమస్యకు గత ప్రభుత్వం కారణమని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మండిపడ్డారు. ఈ 22ఏ పై శనివారం అసెంబ్లీలో మాట్లాడతానని అన్నారు. శనివారం అసెంబ్లీ వద్ద విలేకర్లతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బీఆర్ఎస్ నేతల భూదందాల భాగోతం బహిర్గతం చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోనే ప్రభుత్వ భూముల్లో వెంచర్స్ చేశారని విమర్శించారు. వాటిని నిషేధిత జాబితాలో పెట్టాలని కోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు. భూబకాసురులు మేం కాదని..
గత పదేళ్ల పాలిన
నాయకులే దోచుకున్నారంటూ ఆరోపించారు. ఈ 22ఏలో కోటి16 లక్షల ఎకరాలు ఉన్నాయంనే ది అబద్ధమని స్పష్టం చేశారు. 40 ఏళ్లుగా జరిగిన తప్పుల వల్లే నిషేధిత జాబితాలో భూములు ఉన్నాయని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు.

# మైనర్లకు సోషల్ మీడియాను నియంత్రించాలి

**●పటిష్టమైన రక్షణ వ్యవస్థ అవసరం**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12:**
సోషల్ మీడియాతో పాటు ఇతర డిజిటల్ ప్లాట్ ఫామ్ లు వినియోగించే పిల్లల భద్రతకు మరింత పటిష్టమైన రక్షణ వ్యవస్థ అవ సరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. భారతీయ ఒప్పంద చట్టం ప్రకారం, 18 ఏళ్లలోపు మైనర్లు స్వతంత్రంగా ఎలాంటి ఒప్పందాలు చేసుకోవడానికి చట్టపరంగా అర్హులు కానందున, డిజిటల్ ప్లాటీ ఫాన్లు వారితో ప్రైవసీ పాలసీలు, సర్వీస్ టర్మ్స్ ను ఒప్పందాలు చేసుకోకుండా అవసరమైన నియంత్రణలు తీసుకోవాల్సిన అగత్యం ఉన్నదని సూచించింది. కాస్ట్ రైల్స్ ఫర్ చిత్ర అలయన్స్' అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్ పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మార్కి బాగ్స్, జస్టిన్ మోహనలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషన్ ర్ సంస్థ తరపున న్యాయవాది హెచ్ఎస్. ఫూల్కా వాదనలు వినిపించారు. డిజిటల్ ప్లాట్ ఫామ్ వయసు నిబంధనలు, భారత చట్టాల మధ్య ఉన్నవ్యత్యాసాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. ఫేస్ బుక్, స్నాప్ చాట్ వంటి కొన్ని ప్లాట్ ఫామ్ ఏళ్ల వయసు నుంచే ఐకౌంట్లు ఓపెన్ చేసే అవకాశం కల్పిస్తున్నా యని పేర్కొన్నారు. భారత చట్టాల ప్రకారం 18 ఏళ్లలోపు వారందరినీ మైనర్లుగా పరి గణిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో పిల్లలు డిజిటల్ ప్లాట్ఫామ్లలోకి ప్రవేశం చినప్పుడు వారి వయసును సక్రమంగా నిర్ధారించడం, వారి వ్యక్తిగత సమాచారాన్ని రక్షించడం. ప్రమాదకర కంటెంట్ నుంచి వారిని కాపాడటం వంటి అంశాలపై స్పష్టమైన నియమాలు అవసరమని చెప్పారు. సెక్సువల్ ఎక్స్ ప్లాయిటేటివ్ అండ్ అబ్యూజ్ మెటీరియలకు సంబంధించి దేశంలో కఠినమైన శిక్షా నిబంధనలు ఉన్న సమర్థంగా
అమలు చేయడంలో డిజిటల్ వేదికలు విఫలమవుతున్నాయని చెప్పారు. పిల్లలకు సంబంధించిన అభ్యంతరకర కంటెంటు గుర్తించి తొలగించేందుకు ఆటోమేటెడ్ కంటెంట్ ఫిల్టరింగ్ వ్యవస్థలను విస్తృతంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు.దాంతోపాటు వయసును నిర్ధారించే సమర్థ మైన విధానం ఉండాలన్నారు.

**తల్లిదండ్రుల అనుమతి అవసరం...**

18 ఏళ్లలోపు పిల్లలతో డిజిటల్ ప్లాట్ ఫామ్స్ ఎలాంటి అంగీకారం కుదుర్చు కోకుండా నిబంధనలు రూపొందించాలని సీజేఐ సూచించారు. ఒక మైనర్ డిజిటల్ సేవలను వినియోగించాల్సిన పరిస్థితి ఉంటే తల్లిదండ్రులు, లేదా చట్టబద్ధ సంరక్షకుడి అనుమతి తప్పనిసరి చేయాలని పేర్కొన్నారు. అలాంటి అనుమతి ఇచ్చే వ్యక్తి నిజంగా తల్లిదండ్రులు లేదా చట్టబద్ధ సంరక్షకుడేనా అన్నది గుర్తింపు ధ్రువీకరణ లేదా ఈకేవైసీ ద్వారా నిర్ధారించే విధానం ఉండాలన్నారు. ఇందుకోసం 2021లోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మధ్యవర్తిత్వ మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా నైతిక నియమాల్లో మార్పులు చేయాలని చెప్పారు. లేనిపక్షంలో ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న సుప్రీం కోర్టు ధర్మాసనం 18ఏళ్లలోపు సయసు ఉన్న పిల్లల సోషల్ మీడియా ఇతర డిజిటల్ ప్లాట్ ఫాంలకు వినియోగించే సమయంలో వారి భద్రత అంశంపై సమగ్ర వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది.

# యువ భారత క్రీడా విశ్వవిద్యాలయంతో తెలంగాణను క్రీడా శక్తిగా తీర్చిదిద్దుతాం

**●క్రీడలను విద్యతో అనుసంధానం చేసి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేస్తాంలి**

**●శాసన మండలిలో మంత్రి వాకిటి శ్రీహరి**



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12:**
తెలంగాణలో క్రీడలను విద్యతో అనుసంధానం చేసి, అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడాకారులను తీర్చిదిద్దే లక్ష్యంతో యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ (వైఐపీఈఎస్యూ)
ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.
శాసనమండలిలో సభ్యులు బల్మూర్ వెంకట నర్సింగరావు, మహేష్ కుమార్, శ్రీపాల్ రెడ్డి, అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి, వారికి శాస్త్రీయ శిక్షణ, అత్యుత్తమ కోచింగ్ అందించడంతో పాటు స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మెడిసిన్, ఫిజికల్ ఎడ్యుకేషన్, పరిశోధన వంటి విభాగాలను ఒకే వేదికపైకి తీసుకురావడమే వైఐపీఈఎస్యూ ప్రధాన లక్ష్యమని మంత్రి వివరించారు. విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు దేశీయ, అంతర్జాతీయ ప్రముఖ క్రీడా విద్యాసంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా కొరియా నేషనల్ స్పోర్ట్ యూనివర్సిటీ తో సహకారానికి సంబంధించిన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

**క్రీడా విజ్ఞానంతో పాటు ఉపాధి అవకాశాలు**

క్రీడాకారులకు కేవలం మైదానంలో శిక్షణ ఇవ్వడమే కాకుండా ఆధునిక క్రీడా విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన ఆధారిత శిక్షణ అందించే విధంగా వైఐపీఈఎస్యూ లో కోర్సులను రూపొందించనున్నట్లు మంత్రి తెలిపారు. ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్ వంటి అంతర్జాతీయ పోటీలకు తెలంగాణ క్రీడాకారులను సిద్ధం చేసేందుకు హై పర్ఫార్మెన్స్ సెంటర్స్ తోపాటు ఆధునిక శిక్షణ విధానాలను అభివృద్ధి చేయడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

**గ్రామీణ ప్రాంతాల నుంచే క్రీడా ప్రతిభను వెలికితీస్తాం**

క్రీడా ప్రతిభ పట్టణ ప్రాంతాలకే పరిమితం కాకుండా తెలంగాణలోని ప్రతి గ్రామం నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి రావాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మైదానాల అభివృద్ధి, ఇప్పటికే ఉన్న మైదానాల ఆధునీకరణ, క్రీడా పరికరాల సమకూర్పు, పాఠశాల స్థాయి నుంచే క్రీడా ప్రతిభను గుర్తించడం, మండల--జిల్లా స్థాయిలో ప్రతిభా అన్వేషణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు.
అలాగే స్థానిక కోచ్‌లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లకు శిక్షణ ఇవ్వడంతో పాటు అథ్లెటిక్స్, హాకీ, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో తదితర క్రీడలకు ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. ఇప్పటికే సీఎం కప్ గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఐదు అంచెలలో నిర్వహించామని, 2024 లో 12 కోట్ల వ్యయంతో 36 క్రీడ అంశాలతో 2 లక్షల 90 వేల రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. 2025లో 38.50 కోట్లతో 46 క్రీడాంశాలతో 5.42 లక్షల రిజిస్ట్రేషన్లు జరిగాయని వెల్లడించారు. గ్రామీణ క్రీడా పోటీలను నిర్వహించి, ప్రతిభావంతులైన క్రీడాకారులను జిల్లా, రాష్ట్ర స్థాయి అకాడమీలతో అనుసంధానం చేస్తామని తెలిపారు. బాలికలు, యువత క్రీడల్లో మరింతగా పాల్గొనేలా ప్రత్యేక ప్రోత్సాహక కార్యక్రమాలు చేపడతామని మంత్రి వెల్లడించారు.

**క్రీడాకారులకు ప్రోత్సాహం**

క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 145 మంది క్రీడాకారులకు 16 కోట్ల 60 లక్షలు ఇచ్చి, స్పోర్ట్స్ కోట ద్వారా 304 మంది అథ్లెట్లకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. మహమ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్లకు డిఎస్పి స్థాయి ఉద్యోగాలు ఇచ్చామని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో క్రీడా మైదానం -- ప్రతి యువకుడిలో క్రీడా ప్రతిభను పెంచి తద్వారా తెలంగాణను దేశంలోనే క్రీడా శక్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం క్రీడా రంగాన్ని బలోపేతం చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.
"ఖాజుఖాఖ ద్వారా క్రీడలు--విద్య--ఉపాధి--పరిశోధనలను అనుసంధానం చేసి, తెలంగాణ యువతకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని అవకాశాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మూడు బడ్జెట్లలోనే క్రీడారంగానికి 1,535 కోట్లు కేటాయించగా, బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్లలో కేటాయించిన మొత్తం కంటే ఈ ఒక్క ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వ క్రీడా బడ్జెట్ ఎక్కువగా ఉందని తెలిపారు. గత కేటాయింపులతో పోలిస్తే క్రీడా బడ్జెట్ నాలుగు రెట్లు పెరిగిందన్నారు. గచ్చిబౌలిలో నూతన హాకీ స్టేడియం కోసం 2 టర్ఫులను ఏర్పాటు చేశామని తెలిపారు. గచ్చిబౌలి స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్తో 700 కోట్లతో ఆధునీకరిస్తున్నామన్నారు. క్రీడా అకాడమీల సంఖ్య 6 నుంచి 19 కి పెరిగాయని, 2024 - 26 మధ్య 13 కొత్త అకాడమీలు ఏర్పాటు చేశామని మంత్రి పేర్కొన్నారు. ఇందులో రెండు ఎలైట్ ఫిఫా ఫుట్బాల్ అకాడమీలు ఉన్నాయని, మహిళల ఫిఫా అకాడమీ దేశంలోనే మొట్టమొదటిదని మంత్రి స్పష్టం చేశారు. హకీంపేట్ కరీంనగర్ ఆదిలాబాద్ లో ఇప్పటికే మూడు స్పోర్ట్స్ స్కూల్స్ ఉండగా హనుమకొండలో కొత్త స్పోర్ట్స్ స్కూల్ ప్రారంభం అయ్యిందని తెలిపారు. హైదరాబాదులో తొలిసారిగా ఎఫ్ఐహెచ్
హాకీ ఉమెన్స్ వరల్డ్ కప్ 2026 క్వాలిఫైయర్స్ నిర్వహించామన్నారు.
హైదరాబాద్ వేదిక నుంచి టాప్ మూడు జట్లు ప్రపంచ కప్ కు అర్హత సాధించాయని మంత్రి వెల్లడించారు. డిసెంబర్ 11 నుండి 22 వరకు 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 నిర్వహణ ను 272 కోట్ల అంచనా వ్యయంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించబోతోందని తెలియజేశారు. ఖేలో ఇండియా గేమ్స్ తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించేందుకు అనుమతి ఇచ్చిన కేంద్ర ప్రభుత్వానికి మంత్రి రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.
హాకీ ఇండియా లీగ్ ,వరల్డ్ పికిల్ బాల్ లీగ్, ఆర్చరీ ప్రీమియర్ లీగ్,టెన్నిస్ ప్రీమియర్ లీగ్లు ఈ ఏడాది తెలంగాణలో నిర్వహించనున్నామని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

# గ్రీన్‌ఫీల్డ్ రహదారిపై కారు బోల్తా.. ఇద్దరు మృతి.. ముగ్గురికి తీవ్రగాయాలు




పెనుబల్లి మండల పరిధిలోని ఖమ్మం- దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ రహదారిలోని పెనుబల్లి- కల్లూరు మండలాల మధ్య శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామానికి చెందిన ఓ కుటుంబం శుభకార్యం నిమిత్తం బంగారం, దుస్తులు కొనేందుకు ఉదయం ఖమ్మం వెళ్లారు. తిరిగి కారులో గ్రీన్‌ఫీల్డ్ రహదారిలో వస్తుండగా కల్లూరు మండలం వెంకటాపురం సమీపంలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. దీంతో ఉషారాణి, కారు డ్రైవర్ అక్కడికక్కడే మరణించారు. మృతురాలు ఏపీలోని చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లికి చెందిన కొల్లి ఉషారాణి(56)కాగా మరొకరు కారు డ్రైవర్. తీవ్రంగా గాయపడిన వారిలో సత్తుపల్లి మండలం కిష్టారానికి చెందిన పుచ్చకాయల సీతామహాలక్ష్మి, పుచ్చకాయల శేషు, గోలీ రాజేశ్వరి ఉన్నారు. క్షతగాత్రులను పెనుబల్లి వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలాన్ని సత్తుపల్లి గ్రామీణ సీఐ ముత్తిలింగం, వీఎం బంజర్ షాకీర్ పరిశీలించి సహాయక చర్యలు చేపట్టి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం పెనుబల్లి వైద్యశాలకు తరలించారు.

# తెలంగాణ క్రికెట్‌కు ఫుల్ మెంబర్‌షిప్ ఇవ్వాలి

**బాంబే హైకోర్టు, బీసీసీఐ ముందు టీసీఏ న్యాయపోరాటం**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12:**




తెలంగాణ క్రికెట్‌కు ఫుల్ మెంబర్‌షిప్ కల్పించాలనే డిమాండ్‌తో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) న్యాయపోరాటాన్ని ముమ్మరం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా క్రికెట్ అభివృద్ధికి ప్రస్తుత వ్యవస్థ అడ్డంకిగా మారిందని టీసీఏ ఆరోపించింది. ఈ అంశంపై బాంబే హైకోర్టును ఆశ్రయించడంతో పాటు ఈ నెల 7న బీసీసీఐ నాయకత్వం, బీసీసీఐ అంబుడ్స్‌మన్‌కు సమగ్ర ప్రాతినిధ్యం సమర్పించినట్లు టీసీఏ ప్రధాన కార్యదర్శి ధరం గురువా రెడ్డి తెలిపారు. తెలంగాణలో ఒక నగర కేంద్రంగా ఉన్న సంఘానికి ఫుల్ మెంబర్‌షిప్ హక్కులు కొనసాగుతుండగా, 32 జిల్లాల్లోని క్రికెటర్లకు సమానమైన అవకాశాలు అందడం లేదని ఆయన పేర్కొన్నారు. 'ఒక రాష్ట్రం--ఒక ఫుల్ మెంబర్' విధానాన్ని పునఃపరిశీలించి, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించే విధంగా క్రికెట్ పరిపాలన ఉండాలని కోరారు. బీసీసీఐ రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఫుల్ మెంబర్‌గా కొనసాగేందుకు అవసరమైన అర్హతలు, ఆర్థిక వ్యవహారాలు, పరిపాలన, పాలనా విధానాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని టీసీఏ తెలిపింది. హెచ్‌సీఏకు సంబంధించిన ఆర్థిక, పాలనా అంశాలతో పాటు న్యాయపరమైన పరిణామాలను కూడా సంబంధిత సంస్థల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొంది. హెచ్‌సీఏ ఎన్నికల్లో క్లబ్‌ల అర్హత, ప్రాతినిధ్యం, కొన్ని క్లబ్‌ల భాగస్వామ్యంపై గతంలో వచ్చిన అభ్యంతరాలను కూడా బీసీసీఐ, న్యాయ సంస్థల దృష్టికి తీసుకెళ్లామని గురువా రెడ్డి తెలిపారు. అయితే తమ పోరాటం వ్యక్తులకు వ్యతిరేకం కాదని, సంస్థాగత పారదర్శకత, జవాబుదారీతనం, ఆర్థిక క్రమశిక్షణ కోసమేనని స్పష్టం చేశారు. 2014 నుంచి తెలంగాణలోని జిల్లాలు, గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ అభివృద్ధికి టీసీఏ పనిచేస్తోందని ఆయన తెలిపారు. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం సహా అన్ని జిల్లాల యువ క్రికెటర్లకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా స్థాయిలో క్రికెట్ మౌలిక వసతులు, ప్రతిభావంతులకు అవకాశాలు పెంచేందుకు రాష్ట్రవ్యాప్త వ్యవస్థ అవసరమని పేర్కొన్నారు. తెలంగాణ క్రికెట్ హైదరాబాద్‌కే పరిమితం కాదని, రాష్ట్రంలోని ప్రతి జిల్లా క్రికెటర్‌కు సమాన అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని గురువా రెడ్డి అన్నారు. ఫుల్ మెంబర్‌షిప్ అంశంపై కోర్టులు, బీసీసీఐ, సంబంధిత అధికారిక సంస్థల ముందు తమ వాదనను కొనసాగిస్తామని తెలిపారు.

# మట్టి వినాయకుడే మేలైన ఎంపిక



**నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్: విశ్వనాథ్**
హాలియా: పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో, విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు శ్రీ శ్లోక పాఠశాల ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.
శ్రీ శ్లోక పాఠశాల విద్యార్థులు, చైర్మన్ డాక్టర్ కుకుడాల ఆంజనేయులు కలిసి హాలియా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్సై కె. సాయి ప్రశాంత్కు మట్టి వినాయక విగ్రహాన్ని అందజేశారు. పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులకు కూడా మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా డాక్టర్ కుకుడాల ఆంజనేయులు మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించాలని సూచించారు. మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా నీటి కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించిన వారవుతారని తెలిపారు.
ప్రకృతి మనకు అందించిన అమూల్యమైన వరమని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. చిన్న వయసు నుంచే విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సాదియా, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# భీమా వ్యాపారానికి సానుభూతి ప్రధాన ఇతివృత్తంగా ఉండాలి

**-భీమా నియంత్రణ అభివృద్ధి అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ అజయ్ సేథ్**

**ఘనంగా ఐఐఆర్ఎం పీజీడీఎం 2024--26 బ్యాచ్ స్నాతకోత్సవం**




**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12:**
భీమా నియంత్రణ మరియు అభివృద్ధి అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) మరియు తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్సూరెన్స్ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్ (ఐఐఆర్ఎం), పట్టభద్రులైన విద్యార్థుల విద్యా విజయాలను వేడుకగా జరుపుకుంటూ, పీజీడీఎం 2024--26 బ్యాచ్ స్నాతకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐఆర్‌డీఏఐ ఛైర్మన్ అజయ్ సేథ్, పట్టభద్రులైన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రత్యేక కోర్సులలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లను అందజేసి మాట్లాడుతూ భారతదేశ భీమా మరియు రిస్క్ మేనేజ్‌మెంట్ రంగంలో విస్తరిస్తున్న ఉద్యోగ అవకాశాలను ప్రముఖంగా ప్రస్తావించారు. వేగంగా మారుతున్న ఈ పరిశ్రమలో నిపుణులు విజయం సాధించడానికి నిజాయితీ, సాంకేతికత, ఆవిష్కరణలు మరియు నిరంతర అభ్యాసం చాలా కీలకమని ఆయన నొక్కి చెప్పారు. భీమా రంగంలోని మానవ కోణాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ, భీమా వ్యవస్థలో సానుభూతి కేంద్రంగా ఉండాలని, "అందరికీ భీమా" సాధించడానికి మరియు విక్సిత్ భారత్ దార్శనికతకు దోహదపడటానికి ఇది అత్యవసరం అని ఆయన నొక్కి చెప్పారు.
గౌరవ అతిథిగా విచ్చేసిన ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ సందీప్ కుమార్ శుక్లా, పట్టభద్రులను అంతర్విషయక అభ్యసనం, సాంకేతిక పురోగతి మరియు జీవితకాల నైపుణ్యాభివృద్ధిని స్వీకరించమని ప్రోత్సహించారు. సాంకేతికతను మానవ సామర్థ్యాలతో సమతుల్యం చేయవలసిన అవసరాన్ని నొక్కి చెబుతూ, సాధనాలు మరియు సాంకేతికతకు మానవ విచక్షణ తోడుగా ఉండాలని, "సాంకేతికతను సద్వినియోగం చేసుకోండి, కానీ మానవ విచక్షణను వదులుకోవద్దు" అని పట్టభద్రులను ఆయన కోరారు. ఐఐఆర్ఎం డైరెక్టర్ ఆటాను కె. దాస్ మాట్లాడుతూ భీమా మరియు రిస్క్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ కోసం నైతిక విలువలు కలిగిన, సాంకేతికంగా సన్నద్ధులైన మరియు పరిశ్రమకు సిద్ధంగా ఉన్న నిపుణులను అభివృద్ధి చేయడంలో ఐఐఆర్ఎం యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించరు. ఐఐఆర్ఎం కంట్రోలర్ ఆఫ్ ఎక్సమినేషన్స్ డా, సి. మాధవి ప్రసాద్ వందన సమర్పణ చేసారు.

# ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

**'నిలిచి గెలిస్తేనే ఘనత' పుస్తకావిష్కరణలో విశ్రాంత ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12 :**



సమాజ సేవ చేసేవారు చాలా అరుదుగా ఉండే ప్రస్తుత కాలంలో, గత 25 ఏళ్లుగా నిరంతరాయంగా సామాజిక సేవ చేయడం ఎంతో అభినందనీయమని బీసీ మేధావుల ఫోరం చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు కొనియాడారు. 'ఆరోగ్య మిత్ర' స్వచ్ఛంద సంస్థ రజతోత్సవాల సందర్భంగా శనివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 'నిలిచి గెలిస్తేనే ఘనత' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టి.చిరంజీవులు మాట్లాడుతూ.. విద్య, వైద్యం, ఆరోగ్యం, సీనియర్ సిటిజన్స్ సంక్షేమం, మహిళా సాధికారతే లక్ష్యంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్య మిత్ర సంస్థ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం ప్రశంసనీయమన్నారు. భవిష్యత్తులో ఈ సంస్థ మరిన్ని ఉత్తమ సేవలు అందించి, ప్రభుత్వ గుర్తింపుతో 'పద్మశ్రీ' పురస్కారం అందుకోవాలని ఆకాంక్షించారు. ఇదే వేదికపై ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 42 శాతం బీసీ జనాభా ఉన్నప్పటికీ, వారికి చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం లభించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ అశోక్ పరికిపండ్ల మాట్లాడుతూ, సంస్థ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాబోయే రెండేళ్లపాటు 25 ఇతర సంస్థలతో సమన్వయం చేసుకుంటూ, 25 జిల్లాల్లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అంతేకాకుండా 25 మంది ప్రముఖులకు అవార్డులు ప్రదానం చేయడంతో పాటు 25 పుస్తకాలను ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు.
'బీసీ టైమ్స్' అధినేత సంఘం సూర్యారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చేనేత కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, పద్మశ్రీ పురస్కార గ్రహీత చింతకింది మల్లేశం, విశ్రాంత ఆర్డీవో వడ్డేపల్లి రామకృష్ణ, బీసీ నాయకులు కోల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
ఆదివారం సెప్టెంబర్ 13,2026
www.trinetnews.com

# బీసీలకు రాజకీయ న్యాయం కల్పించాలి

**-బీసీ పొలిటికల్ ఫ్రంట్ డిమాండ్**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12 :** జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కల్పించాలని బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం , బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్లు టి. చిరంజీవులు (విశ్రాంత ఐఏఎస్), బాలగొని బాలరాజ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఇంటెలెక్చువల్ ఫోరం , బీసీ పొలిటికల్ ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో '56 శాతం బీసీలు.. రాజకీయ న్యాయం ఎక్కడ? తెలంగాణ రాజకీయ ముఖచిత్రం' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా బీసీలకు ఇంకా సంపూర్ణ రాజకీయ స్వాతంత్ర్యం రాలేదన్నారు. మైనారిటీలుగా ఉన్న అగ్రకులాల ఆధిపత్యం కొనసాగుతోందని, జనాభాలో మెజార్టీగా ఉన్న బీసీలు రాజ్యాధికారం, ఆర్థిక రంగాల్లో వెనుకబడి ఉన్నారని పేర్కొన్నారు. బీసీలు రాజ్యాధికారం చేపడితే అన్ని కులాలకు



ఆర్థిక, సామాజిక న్యాయం జరుగుతుందని అన్నారు.
మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీలు రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. సంఘాలు, పార్టీలు వేరైనా బీసీలంతా ఐకమత్యంతో రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.
సమావేశంలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న మూడు మంత్రి పదవులను తక్షణమే బీసీలకు కేటాయించాలని, గవర్నర్ కోటాలో ఖాళీ కానున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని తీర్మానించినట్లు చిరంజీవులు, బాలరాజ్ గౌడ్ వెల్లడించారు. వడ్డెర, కుమ్మరి, నాయీబ్రాహ్మణ తదితర కులాలకు ఇప్పటివరకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం లభించలేదని, ఆయా కులాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.
జనగణనలో ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించాలని, బీసీల రాజకీయ ప్రాతినిధ్యంపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించినట్లు తెలిపారు. బీసీలకు జరుగుతున్న రాజకీయ అన్యాయంపై గణాంకాలతో ప్రజా ఉద్యమాన్ని నిర్మించడంతో పాటు, బీసీ సమాజంలోని అన్ని కులాలు, సంఘాలు, మేధావులు ఐక్యంగా ముందుకు రావాలని సమావేశం పిలుపునిచ్చిందన్నారు.
ఈ కార్యక్రమంలో తెలంగాణ విటల్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, కటకం నర్సింగరావు, ఎర్ర సత్యనారాయణ, తాడూరి శ్రీనివాస్, నీరజ, అంబాల నారాయణ గౌడ్ పాల్గొన్నారు.

# రాజీనామా చేయాల్సింది ఎవరు?

**రూపాయి జీతం తీసుకొని పేదలకోసం పనిచేస్తున్న నేను రాజీనామా చేయలా?**
**రూ. 21 కోట్లు తీసుకొని అసెంబ్లీకి రాకుండా ఫార్మ్ హౌస్ లో ఉన్న కే.సీ.ఆర్. రాజీనామా చేయలా?**
**అధికారంలో ఉంటే అవినీతి.. ప్రతిపక్షంలో ఉంటే బ్లాక్‌మెయిల్ రాజకీయాలా?**
**'పొంగులేటి.. పొంగు' అంటూ ఎందుకు భయపడుతున్నారు?**
**మాజీ మంత్రి హరీష్ రావు ను ప్రశ్నించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12 :** 22ఏ భూముల అంశాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాలు చేస్తున్న రాజకీయ ఆరోపణలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజల భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటే.. అసత్య ప్రచారాలతో ప్రభుత్వాన్ని, తనను లక్ష్యంగా చేసుకోవడం ఎందుకని ప్రశ్నించారు.
"చీము, నెత్తురు, సిగ్గు, శరం ఉంటే రాజీనామా చేయాలని




నన్ను అడుగుతున్నారు. మరి ప్రజాధనంతో ఇన్నేళ్లు అధికారాన్ని అనుభవించి.. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన వారు రాజీనామా చేయాల్సింది కాదా?" అని మంత్రి నిలదీశారు.
తాను ప్రతి నెల ఒక్క రూపాయి జీతం మాత్రమే తీసుకుంటూ, పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ టవర్స్ నిర్మాణంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తున్నానని తెలిపారు. "ప్రజల కోసం పనిచేస్తున్న నన్ను రాజీనామా చేయమంటారా?" అని ప్రశ్నించారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి 21 కోట్ల రూపాయలు పొంది అసెంబ్లీకి ప్రజలకు మొఖం చాటేసిన కే.సీ.ఆర్. రాజీనామా చేయాలా? అని హరీష్ రావును ప్రశించారు.
అధికారంలో ఉంటే అవినీతి.. ప్రతిపక్షంలో ఉంటే బ్లాక్‌మెయిల్? "అధికారంలో ఉంటే అవినీతి.. ప్రతిపక్షంలో ఉంటే బ్లాక్‌మెయిల్. ఇప్పుడు చేస్తున్నది కూడా అదే. మీ బ్లాక్‌మెయిల్‌కు, తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రభుత్వం ఇది కాదు" అని స్పష్టం చేశారు.

**'పొంగులేటి.. పొంగు' అంటూ ఎందుకు భయపడుతున్నారు?**

తన పేరును పదేపదే ప్రస్తావిస్తూ 'పొంగులేటి.. పొంగు' అంటూ ప్రతిపక్ష నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై మంత్రి ఘాటుగా స్పందించారు.
"పొంగులేటి.. పొంగు అని ఎందుకు పదేపదే అంటున్నారు? ఎందుకు అంత భయం? శుభకార్యంలో పాలు పొంగితే శుభం. కానీ గోదావరి, కృష్ణా నదులు ఉగ్రరూపంలో పొంగితే ఆ పొంగులో మీరే కాదు.. మీ పార్టీ కూడా నామరూపాలు లేకుండా పోతుంది" అని వ్యాఖ్యానించారు. కే.సీ.ఆర్. క్రింద పోర్లడినా మరోసారి ముఖ్యమంత్రి కాలేరని ఆనాడు ఖమ్మం సభలో నేను చెప్పినట్లుగానే వచ్చే ఎన్నికల్లో కూడా ఈ సభలో కుర్చేనిది కూడా ఇందిరమ్మ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు.

# జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి : శ్రావ్య సుధీర్ రెడ్డి

**సూర్యాపేట్, ట్రైనెట్ న్యూస్ సెప్టెంబర్ 12:** సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో ఈ నెల 19న నిర్వహించనున్న భారీ "మెగా జాబ్ మేళా"ను జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షురాలు సంకరమద్ది శ్రావ్య సుధీర్ రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి సూచనలతో, కాంగ్రెస్ ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో కోదాడలోని సిసి రెడ్డి కాన్వెంట్ స్కూల్‌లో ఈ ఉపాధి నియామక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆమె కొనియాడారు. ఈ నెల 19న ఉదయం 8:00 గంటల నుండి రాత్రి 8:00



గంటల వరకు జరిగే ఈ జాబ్ మేళాలో దేశంలోని వివిధ రంగాలకు చెందిన పలు ప్రముఖ కంపెనీలు, పరిశ్రమలు పాల్గొంటున్నట్లు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పూర్తి చేసిన యువతీ యువకులు అందరూ దీనికి అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థుల నైపుణ్యాల ఆధారంగా ఆయా కంపెనీలలో నేరుగా ఇంటర్వ్యూల ద్వారా తక్షణ కెరీర్ అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు.నిరుద్యోగ యువత ఎలాంటి మధ్యవర్తులను నమ్మకుండా, నేరుగా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి ఉద్యోగాలు పొందేందుకు ఇదొక సువర్ణావకాశమని ఆమె అన్నారు. అభ్యర్థుల నమోదు ప్రక్రియ కోసం ప్రాంగణంలో ప్రత్యేక రిజిస్ట్రేషన్ సహాయక కౌంటర్లు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి నిరుద్యోగికి ఈ సమాచారం చేరేలా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. సూర్యాపేట జిల్లాలోని నిరుద్యోగ యువత తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, బయోడేటా వంటి పూర్తి వివరాలతో సకాలంలో హాజరై, ఈ అవకాశాన్ని చేజార్చుకోకుండా విజయవంతం చేయాలని శ్రావ్య సుధీర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి

**తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్ట రెడ్డి**

**హైదరాబాద్, అంబర్ పేట్, ట్రైనెట్ న్యూస్ సెప్టెంబర్ 12:** విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్ట రెడ్డి అన్నారు. అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజెస్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ వేడుకలు కాచిగూడ మ్యాడమ్ అంజయ్య హాల్ లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా
బాలకిష్ట రెడ్డి పాల్గొని అవంతి గ్రూప్ చైర్మన్, మాజీ మంత్రి ఎం శ్రీనివాసరావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో అనేక విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయని వాటికి అనుగుణంగా విద్యార్థులు రాణించాలన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కొత్త



కోర్సులు
తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ భారతదేశానికి ఒక దిక్సూచి లాంటిదన్నారు. అవంతి గ్రూప్ చైర్మన్ మాజీ మంత్రి ఎం. శ్రీనివాస రావు మాట్లాడుతూ.. అవంతి గ్రూప్స్ కళాశాల దేశంలోనే మొదటి స్థానంలో నిలుస్తుందన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు



కష్టపడి చదివినప్పుడే ఉన్నత స్థాయికి చేరుకుంటారని సూచించారు. అవంతి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ అధ్యక్షులు జ్ఞానేశ్వరి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం ప్రియాంక, మేనేజింగ్ డైరెక్టర్ శ్రవణ్ కుమార్, ఉపాధ్యక్షులు ఎంవి ఎస్–ఎస్ నందీష్ అవంతి కళాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎన్ . వెంకటరమణ, గౌతమ్ మోడీ, చరణ్, డొమినిక్ గాడ్ ఫ్రైడ్ తదితరులు పాల్గొన్నారు.

# కామెడీ స్కిట్‌తో పోటీపడుతున్న బీఆర్ఎస్

**టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్ మాజీ చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12:** తెలంగాణ భవన్ వేదికగా బీఆర్ఎస్ నిర్వహించిన మాక్ అసెంబ్లీపై టీపీసీసీ మీడియా , కమ్యూనికేషన్ మాజీ చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి తనదైన శైలిలో స్పందించారు. మాక్ అసెంబ్లీపై మార్క్ సెటైర్లు వేశారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా స్పందించిన సామ రామ్మోహన్ రెడ్డి.. బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీని కామెడీ స్కిట్‌తో పోల్చారు. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా బీఆర్ఎస్ నేతలు డ్రామాలకు తప్ప దేనికీ పనికిరారంటూ విమర్శలు గుప్పించారు. మాక్ అసెంబ్లీలో పేరుతో ఈ విషయాన్ని మరోసారి నిరూపించుకుంటున్నారంటూ ఎద్దేవా చేశారు



## తార్నాకలో కొనసాగుతున్న 'సేవా-25' కార్యక్రమాలు..

**మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ స్ఫూర్తితో 25 సేవా కార్యక్రమాలకు ప్రణాళిక..**



**తార్నాక, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల నిరంతర ప్రజాసేవకు స్ఫూర్తిగా సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ ఇంటలెక్చువల్ సెల్ ఇంచార్జ్ శ్రీరామ్ వెంకటేష్ ఆధ్వర్యంలో తార్నాకలో చేపట్టిన 'తార్నాక సేవా–25' కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం తార్నాక డివిజన్ లో అన్నదానం, మట్టి వినాయక విగ్రహాల పంపిణీ, వినాయక మండపాలకు సహకారం, ప్రజా అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్ట్రీట్ నంబర్ 3లో మట్టి వినాయక విగ్రహాలను స్థానికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీ రామ్ వెంకటేష్ మాట్లాడుతూ.. నరేంద్రమోదీ 25 ఏళ్లలో ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా ప్రజల కోసం పని చేస్తూ నేడు గ్లోబల్ లీడర్ గా ఎదగడం జరిగిందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 25 సేవా కార్యక్రమాలను చేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా నేడు అయిదు కార్యక్రమాలను చేశామన్నారు. మండప సేవ, యువతకు అవగాహన కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు, మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమం ఇలా వివిధ రకాల కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. యువతకు సామాజిక సేవ మీద అవగాహన కల్పించడం కోసం మరిన్ని కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాం చందర్ రావు కుమారుడు అడ్వకేట్ అవనీష్ మాట్లాడుతూ.. సేవ అనేది ఒకరోజు కార్యక్రమం కాదని, నిరంతరం కొనసాగాల్సిన బాధ్యత అన్నారు. తార్నాక డివిజన్ అధ్యక్షుడు కంటే కరుణాకర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ అందరికీ స్ఫూర్తిదాయకమని, అదే స్ఫూర్తితో తార్నాకలో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమాల్లో అడ్వకేట్ శ్రీనివాస్, సుబ్బారావు, కృష్ణ గౌడ్, దేవ, రాధాకృష్ణ, మోహన్, పవన్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద నిరసనను ఖండించిన బీఆర్ఎస్వీ, మాదిగ జేఏసీ..

**ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద విద్యార్థి నేతల నిరసన.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు..**



**ఉస్మానియా యూనివర్సిటీ, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12 :** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్ హౌస్ వద్ద కాంగ్రెస్ నాయకులు నిర్వహించిన నిరసనను ఖండిస్తూ ఉస్మానియా యూనివర్సిటీలో బీఆర్ఎస్వీ, ఓయూ మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంపల్లి నరేష్, ఓయూ మాదిగ జేఏసీ చైర్మన్ బుసిపాక గణేష్ మాదిగ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ర్యాలీ నిర్వహించి ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కొంపల్లి నరేష్, గణేష్ మాదిగ మాట్లాడుతూ దళితులు, మాదిగల అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం సరికాదన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద చావు డప్పులతో నిరసన చేపట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ పిలుపుతో దళితులు, మాదిగ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో పలువురు మాదిగ విద్యార్థి నాయకులకు రాజకీయ, రాష్ట్రస్థాయి పదవుల్లో అవకాశాలు కల్పించారని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ప్రజాస్వామ్య పద్ధతుల్లో తీవ్రంగా ప్రతిఘటిస్తామని విద్యార్థి నేతలు హెచ్చరించారు. దళిత విద్యార్థుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శులు కొండా గణేష్, గంగధార వెంకట్, అర్జున్, గోపి, సాయి, సాయికిరణ్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పురాతన ఆలయాన్ని సందర్శించిన మర్రి శశిధర్ రెడ్డి

**హైద్రాబాద్ , ట్రైనెట్ న్యూస్. సెప్టెంబర్ 12 :**



బన్సీలాల్ పేట్ లోని "సి" క్లాస్ ప్రాంతంలో శిథిలావస్థలో ఉన్న అతిపురాతన శ్రీ జ్ఞానాంజనేయ స్వామి దేవాలయాన్ని శనివారం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు మర్రి శశిధర్ రెడ్డి సందర్శించారు. గత కొంతకాలంగా ఆలయాన్ని మూసివేసి పూజలు నిలిపివేశారని స్థానికులు ఆయనకు వినతి పత్రం అందజేశారు. 300 గజాల స్థలములో మద్యలో రేకులను తొలగించి మొత్తం స్థలాన్ని కాపాడి, నూతన ఆలయ నిర్మాణానికి సహకరించాలని వారు కోరారు. రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసామని, వారు వచ్చి విచారణ చేపట్టారని, అక్కడ ఎటువంటి వివాదస్పద నిర్మాణాలను చేపట్టవద్దని సూచించారని వారు అన్నారు.
అనంతరం శశిధర్ రెడ్డి మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, అప్పటి వరకు స్వామివారికి ప్రతిరోజూ పూజా కార్యక్రమాలు యథావిధిగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి నాయకుడు మర్రి పురురవ రెడ్డి, మహంకాళి సికింద్రాబాద్ జిల్లా బిజెపి బీసీ మోర్చా అధ్యక్షుడు వై సురేష్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు మహేష్ , బన్సీలాల్ పేట్ డెవలప్మెంట్ & వేల్ పేర్ అసోసియేషన్ ప్రతినిధులు సి. ప్రకాశ్ , రామమోహన్, కె. విజయ్ కుమార్, సి. రవీందర్, మదన్ మోహన్, పురుషోత్తం, ఆర్. శివాజీ, చిట్టి , కె. శ్రవణ్, శ్రీహరి పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరిన యువత

## కార్యకర్తలు మాధవరం కృష్ణారావు

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12:

కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో, శనివారం నాడు శేర్లింగంపల్లి నియోజకవర్గాము మియాపూర్ కి చెందిన అట్టేపల్లి రామ ప్రభు ఆధ్వర్యంలో పలువురు యువత బిఆర్ఎస్ పార్టీలో చేరారు ..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి కుంటుపడిందని ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో చాలా అవస్థలు పడుతున్నారని..



అంతే కాకుండా కేసీఆర్ ప్రారంభించిన అనేక సంక్షేమ పథకాలకు గండి కొట్టి ప్రజల జీవన ప్రమాణాలు స్థితిగతులు నేడు అధ్వాన్న స్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.. మళ్లీ తిరిగి కెసిఆర్ అధికారం లోకి వచ్చి ప్రజలు సుభిక్షంగా ఉంటారని ఆకాంక్షతో బిఆర్ఎస్ పార్టీలో చేరామని అన్నారు.. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు సీనియర్ నాయకులు కలిదిండి రోజా, గంగాధర్, అట్టేపల్లి పురుషోత్తం, అట్టేపల్లి శ్రీరాములు, అట్టేపల్లి దయాకర్, బాబ్జీ, కృష్ణ, వీర రమేష్, తంగెళ్ల శ్రీనివాస్, యెడ్ల హరినాథ్, నాగిశెట్టి వినీత్, అట్టేపల్లి ప్రశాంత్, అడప అజయ్, శ్రీనివాస్ గౌడ్, హనీఫ్, ఎం. గంగాధర్, ఎ. దేవేందర్, ఎం. సాయి కుమార్ గౌడ్, కె. శ్రీను, కె. రాజు, టి. ప్రదీప్, సత్తి, చిన్న, నవీన్, తరుణ్, గన్నీ, పండు. తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాల్లో రికార్డులు సరిగా లేవంటూ అసహనం

**--ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు సేవలు అందుబాటులో ఉండాలంటూ ఆదేశం**

**--ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశం**

**--ఆకస్మిక తనిఖీల్లో జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశాలు**

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12:

సిద్దిపేట జిల్లా కోహెడ బెజ్జంకి మండలాల్లో శనివారం జిల్లా కలెక్టర్ కె హైమావతి ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు.

బెజ్జంకి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్, ఓపి రిజిస్టర్ తనిఖీ చేశారు. మెడికల్ ఆఫీసర్ నుండి కిందిస్థాయి సిబ్బంది వరకు సమయ వేళలు పాటిస్తున్నారా అని ఆరా తీశారు. 24/7 ఆసుపత్రి కావున రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బంది ఆదేశించారు.



సీజనల్ వ్యాధులకు సంబంధించి మలేరియా, డెంగ్యూ కేసులు వివరాలను ఏఎన్ఎం, సూపర్ వైజర్లతో ఆరా తీశారు. ప్రతివారం నిర్వహించే శానిటేషన్ డ్రైవ్ లో తప్పనిసరిగా పాల్గొని ప్రజలకు సీజనల్ వ్యాధులకు గురికాకుండా అవగాహన కల్పించాలని ఆదేశించారు.

బెజ్జంకి మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్-బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని, ప్రతి వంటకం విద్యార్థులకు సరిపోయే విధంగా రుచికరంగా వండి విద్యార్థులకు పెట్టే విధంగా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్, ఇతర రిజిస్టర్లు తనిఖీ చేస్తూ అసహనం వ్యక్తం చేశారు. వసతి గృహంలో విద్యార్థుల హాజరు ప్రకారమే ప్రతిదీ రాయాలని ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. రిజిస్టర్ మైంటైన్



చేయడంలో పలు సూచనలు చేశారు.

కోహెడ మండలంలో తంగళ్ల పల్లి గ్రామ శివారులో దాదాపు 23 ఎకరాల విస్తీర్ణంలో 200 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ పనులను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

నిర్మాణ ప్రాంతం మొత్తం కలియ తిరిగారు. 23 ఎకరాల్లో అతి పెద్ద విద్యాసంస్థ నిర్మాణం కావున మంచి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణిత కాల వ్యవధిలో యుద్ద ప్రతిపాదకన పూర్తి చెయ్యాలని ఈడబ్ల్యూఐడిసి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అధునాతన సాంకేతిక విధానంలో మై-వన్ టెక్నాలజీ తో ఎలాంటి ఇటుకలు వాడకుండా ఈ కాంప్లెక్స్ ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. చుట్టూ కొండల నడుమ పచ్చని చెట్ల మధ్య నిర్మితమవుతున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ రాష్ట్రంలో ఒక రోల్ మోడల్ గా నిలుస్తుందని తెలిపారు.

# గౌతమ్ నగర్‌పై 'హస్తం' గురి..

# మైనంపల్లి మాస్టర్ ప్లాన్!

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12:

గౌతమ్ నగర్: మల్కాజిగిరి మున్సిపల్ సర్కిల్ పరిధిలోని గౌతమ్ నగర్ డివిజన్‌పై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. రానున్న కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం.

గౌతమ్ నగర్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలనే లక్ష్యంతో డివిజన్‌లో ప్రభావం ఉన్న నాయకులు, వ్యాపారవేత్తలు, సీనియర్ నేతలతో మంతనాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. మైనంపల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో గౌతమ్ నగర్‌కు చెందిన ఠాగూర్ అరుణ్ సింగ్తో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.



**'అవకాశమిస్తే గెలిచి కానుకగా ఇస్తా'**

కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పిస్తే గౌతమ్ నగర్ డివిజన్ నుంచి పోటీ చేసి విజయం సాధించి, ఆ విజయాన్ని మైనంపల్లి హనుమంతరావుకు కానుకగా అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఠాగూర్ అరుణ్ సింగ్ తన సన్నిహితుల వద్ద పేర్కొన్నట్లు సమాచారం. దీంతో గౌతమ్ నగర్ డివిజన్‌లో రాబోయే ఎన్నికలపై రాజకీయ ఆసక్తి మరింత పెరిగింది.

**కాంగ్రెస్ పాలనపై ప్రశంసలు**

మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన సన్నిహితుల సమావేశంలో అరుణ్ సింగ్ కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై ప్రశంసలు కురిపించినట్లు తెలిసింది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ద్వారా అన్ని వర్గాల ప్రజలు ప్రయోజనం పొందుతున్నారని ఆయన పేర్కొన్నట్లు సమాచారం.

మల్కాజిగిరి నియోజకవర్గంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న పలు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి మైనంపల్లి హనుమంతరావు విశేషంగా కృషి చేశారని అరుణ్ సింగ్ పేర్కొన్నట్లు తెలిసింది. గౌతమ్ నగర్, మిర్జాల్‌గూడ డివిజన్ల పరిధిలో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన వ్యాఖ్యానించినట్లు సమాచారం.

గౌతమ్ నగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి జరుగుతున్న ప్రయత్నాలు, రాబోయే కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ సమీకరణాలను ఏ మేరకు ప్రభావితం చేస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

## రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాటకు కట్టుబడి ఉండబట్టే మీ ఆటలు సాగుతున్నాయి

**అసత్య ప్రచారాలు చేస్తూ అవమానకరంగా అవహేళనగా మాట్లాడితే వదిలిపెట్టే సమస్య లేదు తాటతీస్తాం**

**మీకు చేతనైతే అభివృద్ధిపై ముఖాముఖి తేల్చుకుందాం రండి**

**మీ హయాంలో ప్రశాంతంగా ఫంక్షన్లు చేసుకున్నది లేదు, గణేష్ మండపాలు పెట్టుకున్నది లేదు**

**కారంపూడి మండల టిడిపి నాయకులు హెచ్చరిక**

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12:

పల్నాడు జిల్లా కారంపూడి పట్టణంలోని తెలుగుదేశం కార్యాలయం లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అభివృద్ధి ధ్యేయంగా ప్రజాక్షేమమే లక్ష్యంగా నిరంతరం ప్రజాసేవకై అంకితంభావంతో పనిచేస్తున్న మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి గురించి అసత్య ప్రచారాలు చేస్తూ అతనిపై లేనిపోని నిందలు మోపుతూ అవహేళన అవమానకరంగా మాట్లాడిన వైసిపి నాయకులకి కార్యకర్తలకి ఒకటే చెప్తున్నాం, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకే వారి మాటకు కట్టుబడి ఉన్నాం కాబట్టే, అభివృద్ధి తప్ప గొడవలు కానీ మరి ఇతర చర్యలకు గాని పూనుకోవట్లేదు. అలాంటి వారిపై అసత్య ప్రచారాలు అవమానకరమైన హేళనగా మాట్లాడి అది చేస్తాము, ఇది చేస్తాము అంటే చూస్తూ ఊరుకోం. ఎవరు ఎంతవరకు పరిమితిగా మాట్లాడాలో ఎవరు ఎంతవరకు చట్టానికి కట్టుబడి ఉండాలో అంతవరకే చూసుకోండి. ఏది పడితే అది ఇష్టారాజ్యంగా మాట్లాడితే ఇక్కడ ఎవరు చేతులు కట్టుకొని కూర్చోలేదు కూర్చోము.

## విజయ డెయిరీని బలోపేతం చేసి పాడి రైతులకు అండగా నిలుస్తాం

విజయ డెయిరీని మరింత బలోపేతం చేసి పాడి రైతులకు అండగా నిలిచేందుకు ప్రజా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య శాఖల మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. శనివారం శాసనమండలిలో విజయ డెయిరీ పాల సేకరణకు సంబంధించిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. విజయ డెయిరీ పాల సేకరణలో తాత్కాలికంగా స్వల్ప తగ్గుదల నమోదైందని మంత్రి తెలిపారు. దీర్ఘకాలంగా కొనసాగిన లీన్ సీజన్ కారణంగానే ఈ తగ్గుదల ఏర్పడిందని వివరించారు. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో విజయ డెయిరీ రోజువారీ సగటు పాల సేకరణ వివరాలను మంత్రి వెల్లడించారు. ఏప్రిల్ 2023 -- మార్చి 2024: రోజుకు 3.60 లక్షల లీటర్లు,

# ప్రతిభ కనపరిచిన పోలీస్ సిబ్బందిని అభినందించిన సీపీ రష్మీ పెరమాల్

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12:

ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని సీపీ రష్మి పెరుమాళ్ అభినందించారు.

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందిని సీపీ అభినందించారు.

శాంతిభద్రతల పరిరక్షణలోను, నేరాల నియంత్రణలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులను, సిబ్బందిని ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన 'సీపీ కనెక్ట్' కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ఇటీవల కోహెడ మండలంలో వరస దొంగతనాలు జరగతుండగా అప్రమత్తతతో వ్యవహరించి చాకచక్యంగా సదరు దొంగలను పట్టుకున్న సిబ్బందిని ప్రోత్సహించడానకి గానూ ఈ మేరకు ప్రశంసా పత్రాలతో పాటు అభినందనలు తెలియజేశారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా



అభినందించారు. గత కొంతకాలంగా కోహెడ మండల పరిధిలో జరుగుతున్న వరుస దొంగతనాలు, ట్రాన్స్ఫార్మర్ కాపర్ వైర్ దొంగతనాలకు ,పాల్పడుతున్న దొంగలను కొట్టుకోవడంలోఅద్భుతమైన ప్రతిభ కనబరిచిన క్రింది పోలీసు సిబ్బందిని సీపీ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేసినారు. ప్రశంస పత్రాలు అలాగే అభినందనలు అందుకున్న వారిలో సీఐ శ్రీధర్, హెడ్ కానిస్టేబుల్ సంపత్, కానిస్టేబుల్ వేణు, హోంగార్డ్ లింగస్వామి లు ఉన్నారు.

## శివ శ్రీ సదానిరంజన్ సిద్ధాంతికి స్వర్ణ నంది పురస్కారం




హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12:

ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ బొగ్గులకుంటలోని సారస్వత పరిషత్‌లో కళానిలయం సాంస్కృతిక సంఘ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువందనం, ఆత్మీయ సత్కారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.కళానిలయం సాంస్కృతిక సంఘ సేవా సంస్థ 26 సంవత్సరాలుగా కళలు, సాహిత్యం, సంస్కృతి, సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పూర్వ మంత్రి శ్రీ సముద్రాల వేణుగోపాలచారి హాజరై పలువురు ప్రముఖులను సత్కరించారు.ఉపాధ్యాయులు, కళాకారులు, సాంస్కృతిక రంగ ప్రముఖులను గౌరవిస్తూ గురువందనం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా శివ శ్రీ సదానిరంజన్ సిద్ధాంతి (అర్చక పురోహితులు, వాస్తు--జ్యోతిష్య పండితులు)ను సాంస్కృతిక, ఆధ్యాత్మిక రంగాల్లో చేస్తున్న సేవలను గుర్తిస్తూ స్వర్ణ నంది పురస్కారంతో ఘనంగా సత్కరించారు. తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ శ్రీ ఉప్పల శ్రీనివాస్ గుప్త చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందజేశారు.ఆధ్యాత్మిక, ధార్మిక, వాస్తు, జ్యోతిష్య రంగాల్లో సేవలందిస్తూ ప్రజలకు మార్గదర్శకత్వం చేస్తున్న సదానిరంజన్ సిద్ధాంతికి స్వర్ణ నంది



పురస్కారం లభించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.ఈ గౌరవం తనకు మరింత బాధ్యతను పెంచిందని, సమాజానికి తన వంతు సేవలను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని సదానిరంజన్ సిద్ధాంతి తెలిపారు.కళానిలయం సాంస్కృతిక సంఘ సేవా సంస్థ 26 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సాంస్కృతిక, సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా వక్తలు ప్రత్యేకంగా ప్రశంసించారు.తనకు స్వర్ణ నంది పురస్కారం అందజేసి ఆత్మీయంగా సత్కరించినందుకు కళానిలయం సాంస్కృతిక సంఘ సంస్థ నిర్వాహకులు, ఏ. సురేందర్ గారికి శివ శ్రీ సదానిరంజన్ సిద్ధాంతి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో సాంస్కృతిక, సాహిత్య, ఆధ్యాత్మిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు, కళానిలయం సభ్యులు, ఉపాధ్యాయులు, అభిమానులు పాల్గొన్నారు.

## రాష్ట్ర కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొప్పోజు

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12:

తెలంగాణ రాష్ట్ర కవులు రైతు సంఘం 2011 కౌలు రైతుల చట్టాన్ని అమలు చేయాలి.

కొప్పోజు సూర్యనారాయణ తెలంగాణ రాష్ట్ర కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి 10/9/2026 న హైదరాబాదులో జరిగిన తెలంగాణ రాష్ట్ర కౌలు రైతుల విస్తృత కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక చర్చలు చేయటం జరిగింది. కౌలు రైతులు 2011 చట్టాన్ని అమలు చేయాలని ఎన్నికల సందర్భంగా కౌలు రైతులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కౌలు రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని. విస్తృత కౌన్సిల్ సమావేశం డిమాండ్ చేసింది అనంతరం జరిగిన నూతన కమిటీ ఎన్నికల్లో కొప్పోజు సూర్యనారాయణ ను రాష్ట్ర కౌలు రైతుల సంఘమునకు ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేయడం జరిగింది. కొప్పోజు సూర్యనారాయణ ఎంపిక కు సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్లావుల



రాములు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల శ్రీనివాస్, సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు ఎల్లావుల రమేష్, రైతు సంఘం నాయకులు మామిడి నరసయ్య జక్కుల రమేష్ తదితరులు అభినందనలు తెలియజేశారు

## ద్వారకాతిరుమలలో ఘనంగా మహా గణపతి ఉత్సవాలు - రేపటి నుండి ప్రారంభం

**10 రోజుల పాటు మహా గణపతి ఉత్సవాలు**

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12:



ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానానికి ఉపాలయమైన శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామివారి దేవాలయంలో మహా గణపతి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.ఈ ఉత్సవాలు సెప్టెంబర్ 14 నుండి 23వ తేదీ వరకు 10 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరగనున్నట్లు ఆలయ ఈవో వి. త్రినాథరావు తెలిపారు.ఉత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 23వ తేదీన ప్రత్యేకంగా 'లక్ష్మీ గణపతి హోమం' నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ ఆధ్యాత్మిక వేడుకలకు యావత్ భక్తజనులు పెద్ద సంఖ్యలో విచ్చేసి, స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఈవో విజ్ఞప్తి చేశారు.

# పార్టీ ప్రతిష్టను దెబ్బతీయొద్దు

### టీడీపీ నేతల హితవు.. కొమరా వెంకట నరసయ్యకు సవాళ్లు

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12:**
పార్టీలో ఉంటూ టీడీపీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించవద్దని ఆ పార్టీ మండల నేతలు సూచించారు. అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని, పార్టీకి మేలు చేసే కార్యక్రమాలు చేపట్టాలని హితవు పలికారు. మాజీ రాష్ట్ర డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య తీరుపై విమర్శలు చేస్తూ శనివారం ఒంటిమిట్టలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు ఆయనపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.



### పార్టీకి మేలు చేసే కార్యక్రమాలు చేయాలి

టీడీపీ మండల అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి మాట్లాడుతూ పార్టీని అప్రతిష్టపాలు చేసే విధంగా వ్యవహరించవద్దన్నారు. పార్టీకి మేలు చేసే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పార్టీలో ఉంటూ అందరినీ కలుపుకుపోయే మనస్తత్వాన్ని అలవర్చుకోవాలని కోరారు.

### కోదండరామాలయం వద్ద ప్రమాణానికి సిద్ధం

టీడీపీ నేత బొబ్బిలి రాయుడు మాట్లాడుతూ కొటేషన్లు తీసుకున్నామని పదేపదే ప్రెస్‌మీట్లలో చెబుతున్నారని, ఎవరు ఏం చేశారో తనకు తెలుసన్నారు. "నీవు టీడీపీలో ఏం చేశావో మాకు తెలుసు. కోదండరామాలయం వద్దకు రా.. ప్రమాణానికి సిద్ధమవుదాం" అని సవాల్ విసిరారు.

### ఎన్నికల్లో ఒక్కసారైనా ప్రచారం చేశావా?

జడ్పీటీసీ ముద్దుకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఒక్కసారైనా తన పక్కన ప్రచారం చేశావా అని ప్రశ్నించారు. టీడీపీని, ఇన్‌చార్జి జగన్మోహన్‌రాజును విమర్శించడం తప్ప ఇంకేమైనా ఉందా అని నిలదీశారు.

పదేపదే విమర్శలు సరికాదు

స్పెషల్ క్లాస్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్, టీడీపీ నేత ఎస్వీ రమణ మాట్లాడుతూ పార్టీని, నాయకులను విమర్శిస్తూ పదేపదే సమావేశాలు నిర్వహించడం సబబు కాదన్నారు. పార్టీ ప్రతిష్టను కాపాడుతూ అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

### సాయిబాబా ఆలయం వద్ద ప్రమాణం చేద్దాం

గ్రామ కమిటీ అధ్యక్షుడు పత్తి సుబ్బరాయుడు మాట్లాడుతూ "నీవు సాయిబాబా భక్తుడివి.. నేను సాయిబాబా ఆలయం వద్దకు వస్తాను. నీవు పెట్టే ప్రెస్‌మీట్లలో ఒక్కటైనా నిజం ఉందా? సాయిబాబా ఆలయం వద్ద ప్రమాణం చేద్దాం.. రా" అని సవాల్ విసిరారు.

స్థానిక ఎన్నికల్లో విజయానికి కృషి చేద్దాం

టీడీపీ ప్రధాన కార్యదర్శి ఆలూరు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ మీరు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తామని, కూర్చొని మాట్లాడి చర్చించుకుందామని అన్నారు. అందరినీ కలుపుకొని పోదామని, స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

### అభివృద్ధిని ఓర్వలేక విమర్శలు

ఎంపీటీసీ సుంకేసుల భాష మాట్లాడుతూ రాజంపేట ఇన్‌చార్జి జగన్మోహన్‌రాజు దేవుడిలా వచ్చి రాజంపేట అభివృద్ధికి కృషి చేస్తుంటే ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. నడివీధి గంగమ్మ గుడి వద్ద సమస్య పరిష్కారానికి రాజు ఎంతో కృషి చేశారని, ఆ సమస్య కోసం ఒక్కరోజైనా అక్కడికి వచ్చారా అని ప్రశ్నించారు. అలాంటి మాటలు మాట్లాడవద్దని హితవు పలికారు.



### భారీగా నాయకులు, కార్యకర్తల హాజరు

ఈ సమావేశంలో మండల టీడీపీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆలూరు వెంకటసుబ్బయ్య, జడ్పీటీసీ ముద్దుకృష్ణారెడ్డి, ఎస్వీ రమణ, బొబ్బిలి రాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పత్తి సుబ్బరాయుడు, సాలాబాద్ బుజ్జి, నల్గొండ వెంకటసుబ్బారెడ్డిపల్లి వెంకటరెడ్డి, రాజారెడ్డి, ఎంపీటీసీ భాష, శ్రీహరి, చింతగింజల సుబ్రహ్మణ్యం, రోశయ్య, చంద్రమౌళి, ప్రతాపరెడ్డి, ఎల్లయ్య, బాలకృష్ణ, ఉదయ్, వెంకటేశు, శ్రీను, ఐవారయ్య, హత్యవారయ్య, మునీంద్ర, మధు, రామ్మూర్తిరెడ్డి, వినీత్, వెంకటసుబ్బయ్య, రమేష్, నాగరాజు, గఫూర్, నరసింహ, రవిశంకర్, రాజారెడ్డి, రామసుబ్బారెడ్డి, రాజా యాదవ్, శంకర్ రాజా, రాజశేఖర్, జైసింహ, శివ, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. భారీగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

# బాల్యవివాహాలను నిర్మూలించడం సమాజ బాధ్యత : సీనియర్ అడ్వకేట్ గెల్లెపోగు జయానందనరావు

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12:**
బాల్య వివాహాలను నిర్మూలించటం సమాజ బాధ్యత అని మాచర్ల సీనియర్ అడ్వకేట్ గెల్లెపోగు జయానందరావు అన్నారు
పల్నాడు జిల్లాలో బాల్యవివాహాలు నిర్మూలనను కార్డ్స్ సంస్థ బాలబాట ఆవేర్నెస్ కార్యక్రమాలు ప్రజలను చైతన్య పరచడం నేటి అవసరం అని కార్డ్స్ సంస్థ శనివారం దుర్గి లో ఉపాధి హామీ మీటింగ్ హాల్ నందు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి దుర్గి బాలబాట ఏ సి ఓ కుక్కమూడి ప్రమీల అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సదస్సుకు కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్నాథ్ హాజరై మాట్లాడుతూ.. నిరక్షరాస్యత మూఢనమ్మకాలు అభద్రత భావంతో కొంతమంది బాల్యవివాహాలు జరుగుతున్నాయని ,వాటిని విద్య ద్వారానే నిర్మూలించవచ్చని బాల్యవివాహాలు నిర్మూలన ఏ ఒక్క ప్రభుత్వ శాఖ బాధ్యత కాదని ఆయన అన్నారు . పల్నాడు









జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మరియు దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కుక్కమూడి ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చట్ట ప్రకారం 2006 వ సంవత్సరంలో వచ్చిన చట్టం ఆడపిల్లలకు 18 సంవత్సరాలు ,మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండిన వారికి పెండ్లి చేయాలని అలా కాకుండా పెండ్లి చేస్తే బాల్య వివాహాలు కిందకే వస్తాయని అది చట్టరీత్యా నేరమని ఆయన అన్నారు. బాల్య వివాహాలపై కలిగే నష్టాలపై ఆయన అవగాహన కల్పించారు. హ్యూమన్ రైట్స్ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు గురజాల అప్పారావు, ఏపీ భవన నిర్మాణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యరసాని జక్రయ్య, ఎమ్మార్పీఎస్ మాచర్ల నియోజకవర్గం అధ్యక్షులు గేరా మల్లయ్య, కార్డ్స్ సంస్థ బాలబాట ఆర్ సి ఓ పేరుపోగు ప్రసాదరావు, బాల్యవివాహాల నిర్మూలన పై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సరస్వతి కోచింగ్ సెంటర్ మాచర్ల రాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం మొదటిలో బాలబాట డివోలతో బాలబాట ప్రతిజ్ఞ చేయించారు.
అనంతరం 30 మంది డివోలకు ప్రొవిజన్స్ పంపిణీ చేశారు.

# ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి నిర్వహించాలి

### ఒంటిమిట్ట సీఐ వెంకటేశ్వర్లు

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12:**
వినాయక చవితి ఉత్సవాలను మండల ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిర్వహించుకోవాలని ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు కోరారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎస్సై శ్రీనివాసులుతో కలిసి ఉత్సవాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ముందుగా మండల ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో వినాయక విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు అనుమతి తీసుకోవాలని సూచించారు. ఉత్సవాలు ఎన్ని రోజులు నిర్వహిస్తారు, నిమజ్జనం ఎప్పుడు, ఎక్కడ చేపడతారనే వివరాలను ముందుగానే పోలీసు శాఖకు తెలియజేయాలన్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని సీఐ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు.



కులమతాలకు అతీతంగా గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో పండుగను జరుపుకోవాలని సూచించారు. విగ్రహాల వద్ద భద్రత కోసం నిర్వాహకులు 24 గంటలూ ఇద్దరు చొప్పున అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లపై పోలీసు, సంబంధిత శాఖల అధికారులు దృష్టి సాగించామని సీఐ తెలిపారు. నిమజ్జనం నిర్వహించే ప్రాంతాలను ఇప్పటికే పరిశీలించామని , కుడమలూరు, నందలూరు, సిద్దవటం, పెన్నా నది పరవాహక ప్రాంతాల్లో నిమజ్జనానికి సంబంధించి ఏర్పాట్లను చేస్తున్నట్లు పేర్కొన్నారు. విగ్రహాలను ఏయే ప్రాంతాల్లో నిమజ్జనం చేయాలనే విషయాన్ని అధికారికంగా ప్రకటించామని వెల్లడించారు.
వినాయక ఉత్సవ కమిటీలు పోలీసు శాఖకు సహకరించి వేడుకలను శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించాలని సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.

# 20 ఏళ్లుగా పనిచేస్తూ.. 405 గ్రాముల బంగారం కాజేశాడు!

### జైన్ జ్యువెల్ పార్క్‌లో పనిచేస్తున్న వ్యక్తి అరెస్ట్..

### బంగారు ఆభరణాలు స్వాధీనం

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12:**
నమ్మకంగా పనిచేస్తున్న ఉద్యోగి యజమాని వద్ద ఉన్న బంగారు ఆభరణాలను కాజేసిన ఘటన నరసాపురం పట్టణంలో వెలుగుచూసింది. సుమారు 20 ఏళ్లుగా జైన్ జ్యువెల్ పార్క్‌లో పనిచేస్తున్న వ్యక్తి, యజమానికి తెలియకుండా 405 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగిలించినట్లు పోలీసులు గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం. నరసాపురం డిఎస్పి మేకర్ సుధాకర్



వివరాలు ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం గొల్లలకోడేరు గ్రామానికి చెందిన షేక్ లాల్ సాహెబ్ (35) నరసాపురంలోని జైన్ జ్యువెల్ పార్క్‌లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో యజమానికి తెలియకుండా బంగారు ఆభరణాలను దొంగిలించినట్లు అతనిపై ఫిర్యాదు అందింది. దీనిపై నరసాపురం టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 156/2026, బీఎన్ఎస్ సెక్షన్ 306 కింద కేసు నమోదైంది. ఈ కేసులో నిందితుడిని సెప్టెంబరు 10న సాయంత్రం 7.15 గంటలకు కేసు నమోదు అయిందని పోలీసులు తెలిపారు. అప్రమత్తమైన పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితుడి ఇంటి వద్ద మాటు వేసి అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు దొంగిలించిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నరసాపురం డీఎస్పీ మేక సుధాకర్ రావు, పట్టణ సీఐ ఆకుల రఘు ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని పట్టుకున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# రేపు జరగనున్న పత్రిక మరియు ఎలక్ట్రానిక్ మీడియా సమావేశాన్ని జయప్రదం చెయ్యండి



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12:**
సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ లో వర్తక సంఘం కార్యాలయం వద్ద రేపు జరగనున్న పత్రిక మరియు ఎలక్ట్రానిక్ మీడియా సమావేశాన్ని జయప్రదం చేయాలని హుజూర్నగర్ ఎలక్ట్రానిక్ మీడియా తెలిపింది. శనివారం హుజూర్నగర్ ఎలక్ట్రానిక్ మీడియా సమావేశం శక్తి న్యూస్ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా అన్ని న్యూస్ చానల్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. జర్నలిస్ట్ ల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ యూనియన్లకు అతీతంగా కలసి పనిచేయాలని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం రేపు వర్తక సంఘం కార్యాలయం వద్ద ఉదయం 10 గంటల కు నిర్వహిస్తున్న పత్రిక మరియు ఎలక్ట్రానిక్ మీడియా సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు దొంతగాని రాజా రమేష్, బోజనపల్లి నాగేశ్వర రావు,త్రిపురం రమేష్ రెడ్డి,పొట్ట లక్ష్మణ్, పాలెల్లి నరేష్, తండు వెంకన్న గౌడ్, తండు నరేష్,లింగం మధు, యరబోలు వెంకట్ రెడ్డి,ఆతుకూరి వెంకటేష్, కాంపాటి సందీప్,రుద్రపంగు శ్యామ్,కొమ్ము మహేష్,పలిశెట్టి నరసింహ నాయుడు,నారప రెడ్డి,వెచ్చ సందీప్,అంజన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వెనకనుంచి ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు వ్యక్తి మృతి

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12:**





జగిత్యాల జిల్లా ధరూర్ గ్రామంలో ఈ రోజు తెల్లవారుజామున జగిత్యాల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సునెంబర్ టీ జి 21ఓ0041 వెనకనుంచి డి కొట్ట గా తిరుమల గంగాధర్ మరణించారు ఈరోజు తెల్లవారుజామున తన ఇంటి నుండి సైకిల్ పై మెయిన్ రోడ్డు 563 నేషనల్ హైవే రోడ్డుపై సైకిల్ పై వెళ్తున్న తన తండ్రి తిరుమల గంగాధర్ ఆర్ టి సి బస్ గుద్ధి తల పగిలి మరణించారు అని గంగాధర్ కొడుకు అభిషేక్ తెలిపారు ఈ సందర్భంగా అభిషేక్ మాట్లాడుతూ మేము చిన్నగా టీ స్టాల్ నడుపుకొని బ్రతికే మా తండ్రి మరణించడశీ పట్ల మా కుటుంబం పోషణ కరువాయే పరిస్థితి ఏర్పడింది ప్రభుత్వము ఆదుకోవాలని అభిషేక్ కోరారు మృతునికి ఒక అమ్మాయి ఒక అబ్బాయి భార్య రాధ కలదు బస్సు డ్రైవర్ కత్తి సత్యనారాయణ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య రాధా ప్రభుత్వాన్ని కోరారు

# మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం.. శాప్ డైరెక్టర్ కొవ్వాసు. జగదీశ్వరి



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 12:**
ఏలూరు జిల్లా, పోలవరం నియోజకవర్గంలో మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు. జగదీశ్వరి పిలుపునిచ్చారు, వినాయక చవితి సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని సూచించారు. మట్టి విగ్రహాల వినియోగంతో ప్రకృతిని కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణహిత వినాయక చవితిని జరుపుకోవాలని ఆమె కోరారు.

# zomato మరో షాక్.. క్యాష్ ఆన్ డెలివరీపై ఫీజు!




ఫుడ్ డెలివరీ యాప్ జోమాటో మరో షాకిచ్చింది. క్యాష్ ఆన్ డెలివరీపై అదనంగా రూ.5 ఛార్జీ వసూలు చేస్తోంది. మీల్‌కిట్ కంపెనీ బిల్ సమ్మరీలో ఈ ఛార్జీలు కనిపిస్తున్నాయి. ఆదాయాన్ని మెరుగుపరుచుకోవడం, డిజిటల్ పేమెంట్ల వైపు వినియోగదారులను మళ్లించేందుకు కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఫుడ్ ఆర్డర్‌పై ప్లాట్‌ఫాం ఫీజు, రెస్టారెంట్ ప్యాకేజింగ్ ఛార్జీలు, జీఎస్టీని జోమాటో వసూలు చేస్తోంది. దీనికి సీఓడీ ఛార్జీలు అదనపు భారం. ఆన్‌లైన్ పేమెంట్లు చేసే కస్టమర్లకు ఈ ఛార్జీలు వర్తించవు. కాగా, జోమాటో ఇటీవలే తన ప్లాట్‌ఫాం ఫీజును పెంచిన విషయం తెలిసిందే. వినియోగదారుడి ఒక్కో ఆర్డర్‌కు ఫీజును రూ.12.50 నుంచి రూ.14.90కి సవరించింది.

**» ఆదాయం పెంపు, డిజిటల్ చెల్లింపుల వైపు వినియోగదారుల మళ్లింపు లక్ష్యం**

### ఏమేం ఛార్జీలు వసూలు చేస్తోంది?

ప్లాట్‌ఫాం ఫీజు: ప్రతి ఆర్డర్‌పై వసూలు

రెస్టారెంట్ ప్యాకేజింగ్ ఛార్జీలు: రెస్టారెంట్లు విధించే ఛార్జీలు

జీఎస్టీ: ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్ను

సీఓడీ ఛార్జీలు: క్యాష్ ఆన్ డెలివరీపై అదనంగా రూ.5

ఆన్‌లైన్ పేమెంట్లు చేసే వారికి ఈ ఛార్జీలు వర్తించవు.

ఆన్‌లైన్ పేమంట్లు చేసే వారికి ఈ ఛార్లీలు వర్డించవు.

### పోటీ మరింత తీవ్రమవతోంది

ఫుడ్ డెలివరీ రంగంలో పోటీ తీవ్రమవుతోంది. ర్యాపిడో ఓన్లీ, ఫ్లిప్‌కార్ట్ ఈట్ ఐస్ ఫుడ్ డెలివరీ సేవలను ప్రయోగత్మకంగా ప్రారంభించాయి. దీంతో ఈ రంగంలో ఉన్న జోమాటో, స్విగ్గీకి గట్టి పోటీ ఎదురవుతోంది. కంపెనీ లాభాల్ని పెంచుకోవడానికి జోమాటో సీఓడీ ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

## 88 ఏళ్ల వృద్ధుడికి పింఛను పాలసీ.. నిబంధనలకు విరుద్ధంగా జారీ



హైదరాబాద్: పాలసీ నిబంధనలకు విరుద్ధంగా 88 ఏళ్ల వయోవృద్ధుడికి జీవిత బీమా పాలసీని విక్రయించిన వ్యవహారంలో కెనరా హెచ్‌ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీపై భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) ఆగ్రహం వ్యక్తం చేసింది. నిబంధనలు ఉల్లంఘించి, పాలసీని కట్టబెట్టినందుకు (మిస్ సెల్లింగ్) ఆ బీమా కంపెనీపై రూ.కోటి జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఏం జరిగిందంటే..

కెనరా హెచ్‌ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, తమ కార్పొరేట్ ఏజెంట్ అయిన కెనరా బ్యాంక్ ద్వారా 88 ఏళ్ల వ్యక్తికి 'డిఫర్డ్ యాన్యుటీ పాలసీ' విక్రయించింది. పాలసీదారుడిగా ఆ వృద్ధుడి పేరును, యాన్యుటెంట్ (పింఛను అందుకునేవారు)గా ఆయన కుమార్తె పేరును చేర్చారు. ఏటా రూ.2 లక్షల ప్రీమియం చొప్పున నాలుగేళ్లపాటు చెల్లించేలా ఈ పాలసీని రూపొందించారు.

ఈ పాలసీలో చేరేందుకు 30–80 ఏళ్ల వారికి మాత్రమే అనుమతి ఉంటుంది. కానీ, వయోపరిమితి దాటినప్పటికీ వ్యక్తికి పాలసీని విక్రయించడమే కాకుండా, పాలసీదారుడి వయోభారాన్నీ, భారీ ప్రీమియాన్ని దృష్టిలో పెట్టుకుని, చేయాల్సిన ఆర్థిక స్తోమత, పాలసీ అనుకూలత విచారణలనూ కంపెనీ నిర్వహించలేదని ఐఆర్‌డీఏఐ విచారణలో తేలింది.

దీంతోపాటు కొన్ని తీవ్రమైన లోపాలనూ నియంత్రణ సంస్థ గుర్తించింది.

ప్లాన్ ముఖ్యాంశాలు, షరతులు పాలసీదారుడికి వెల్లడించలేదు. వెరిఫికేషన్ కాల్, ప్రతిపాదన పత్రం నిర్వహణలో తీవ్ర లోపాలు కనిపించాయి.

పాలసీ ప్రయోజనాల గురించి ఇచ్చే అంచనా పత్రంపై పాలసీదారుడి నుంచి ఎలాంటి ధ్రువీకరణ లేదు.

పాలసీని విక్రయించిన సమయంలో కస్టమర్ ఇన్ఫర్మేషన్ షీట్ (సీఐఎస్), దరఖాస్తు పత్రం ప్రతులను అందించలేదు.

పాలసీ అధికారికంగా జారీ చేయకముందే ప్రీమియం సొమ్ము వసూలు చేశారు.

పాలసీదారుడు మరణిస్తే, ఎలాంటి పరిణామాలు ఉంటాయనే విషయంపైనా స్పష్టమైన సమాచారం ఇవ్వలేదు. ఈ లోపాలన్నీ కంపెనీ అంతర్గత పర్యవేక్షణ వైఫల్యాన్ని, మోసపూరిత విక్రయాన్ని, పాలసీదారుల ప్రయోజనాలకు విఘాతం కలిగించడాన్ని స్పష్టంగా చెబుతున్నాయని ఐఆర్‌డీఏఐ పేర్కొంది. జరిమానాతో పాటు, 75 ఏళ్లు దాటిన వ్యక్తులకు కెనరా బ్యాంకు ద్వారా విక్రయించిన అన్ని పాలసీలపైనా సమగ్ర విచారణ నిర్వహించాలని ఆదేశించింది.

ప్రీమియం సొమ్ము వాపసు..

ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చి, ఐఆర్‌డీఏఐ దృష్టికి వెళ్లిన తర్వాత బీమా కంపెనీ స్పందించింది. సంస్థ ప్రతినిధులు పాలసీదారుడిని కలిసి, ఆయన కోరిక మేరకు రెండో ఏడాది ప్రీమియంతో కలిపి రూ.4.09 లక్షలను వెనక్కి ఇచ్చేశారు. విక్రయించిన ఏజెంట్‌కు ఇచ్చిన కమీషన్‌నూ రద్దు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఉల్లంఘనలు జరగకుండా ప్రచార పత్రాలు, పాలసీ పత్రాలు, సూటబిలిటీ అసెస్‌మెంట్ విధానాల్లో సవరణలు చేసినట్లు కంపెనీ తెలిపింది. పాలసీ జారీకి ముందే వీడియో ఆధారిత ధ్రువీకరణ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు వివరించింది.

**ఇండస్‌ఇండ్ బ్యాంక్‌పైనా...**

కార్పొరేట్ బీమా ఏజెంట్‌గా నిబంధనలు ఉల్లంఘించడమే కాకుండా, ఫిర్యాదుల వ్యవస్థపై అవాస్తవాలు సమర్పించిన ఇండస్‌ఇండ్ బ్యాంకుపైనా ఐఆర్‌డీఏఐ రూ.కోటి అపరాధ రుసు విధించింది. తనఖీల సమయంలో పాలసీదారుల కోసం ప్రత్యేక ఫిర్యాదుల విభాగం, టోల్–ఫ్రీ ఐవీఆర్ వెసులుబాటు లేవని తేలింది. వెబ్‌సైటులో ఫిర్యాదుల పోర్టల్ అందుబాటులోకి తెచ్చామని బ్యాంకు స్క్రీన్‌షాట్లు సమర్పించినా, అధికారుల ప్రయోగాత్మక పరిశీలనలో ఎలాంటి రశీదు గానీ, ఎస్ఎంఎస్/ఇ–మెయిల్ సమాచారం గానీ వెళ్లలేదు. వ్యవస్థ పనిచేయడం లేదని నిరూపితం కావడంతో నియంత్రణ సంస్థ ఈ చర్యలు చేపట్టింది. పూర్తి వివరాలు లేకుండా ఎస్ఎంఎస్‌ల ద్వారానే పునరుద్ధరణ నోటీసులు పంపించడం, ఆర్‌బీఐ, సెబీ, ఈడీ విధించిన జరిమానాల సమాచారాన్ని నిర్ణీత 30 రోజుల్లోగా అందించకపోవడం,




## ఫాస్టాగ్ వినియోగదారులకు శుభవార్త.. వాహనంపై ఉన్న ట్యాగ్ ఎప్పటికీ అలాగే..!

ఫాస్టాగ్ వినియోగదారులకు కేంద్రం శుభవార్త చెప్పింది. ఇకపై ఫాస్టాగ్‌కు అనుసంధానమైన బ్యాంకును మార్చుకోవాలంటే.. వాహనంపై ఉన్న ట్యాగ్‌ను తొలగించి కొత్తది తీసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది. 'వన్‌ట్యాగ్' విధానాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ముంబయిలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026లో ప్రారంభించారు. మొబైల్ నంబర్ పోర్టబిలిటీ తరహాలో ఈ సేవ పనిచేస్తుంది. ప్రస్తుత బ్యాంకు సేవలు నచ్చకపోతే మరో బ్యాంకుకు ఫాస్టాగ్ ఖాతాను మార్చుకోవచ్చు. వాహనంపై ఉన్న ట్యాగ్ మాత్రం అలాగే ఉంటుంది. ఈ మార్పు ప్రక్రియను రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌లో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎస్‌బీఐ(రాదీ×), ఐసీఐసీఐ , ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ సహా పలు సంస్థలు ఇప్పటికే ఈ విధానంలో భాగమయ్యాయి.

ఫాస్టాగ్ సేవల మార్పులో వాహనదారులకు ఎదురవుతోన్న ఇబ్బందులను తగ్గించడమే వన్‌ట్యాగ్ విధానం లక్ష్యమని గడ్కరీ తెలిపారు. గతంలో బ్యాంకు మార్చాలంటే పాత ఫాస్టాగ్ ఖాతాను మూసివేసి.. కొత్త ట్యాగ్ తీసుకోవాల్సి వచ్చేదని పేర్కొన్నారు.

మార్చి కల్లా అడ్డంకులు లేని టోల్‌బూత్‌లు

ప్రక్రియ ఇలా..

1. ప్లే స్టోర్ నుంచి రాజ్‌మార్గ్‌యాత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని లాగిన్ అవ్వాలి.
2. యాప్‌లో ఫాస్టాగ్/వన్‌ట్యాగ్ సేవను ఎంచుకోవాలి.
3. ప్రస్తుతం ఉన్న ఫాస్టాగ్ వివరాలు నమోదు చేయాలి.
4. బ్యాంకు మార్చే ఆప్షన్‌ను ఎంచుకోవాలి.
5. కొత్తగా ఎంచుకున్న బ్యాంకును ఎంపిక చేసి.. అవసరమైన వివరాలు సమర్పించాలి.
6. ధ్రువీకరణ పూర్తయిన తర్వాత ఫాస్టాగ్ కొత్త బ్యాంకుకు పోర్ట్ అవుతుంది. తదనంతరం వాహనంపై ఉన్న పాత ట్యాగ్‌నే కొనసాగించవచ్చు.

## బీఎండబ్ల్యూ కొత్త 7 సిరీస్ కార్ల ఆవిష్కరణ

దిల్లీ: జర్మనీ విలాసకార్ల సంస్థ బీఎండబ్ల్యూ, కొత్త 7 సిరీస్ కార్లను మన దేశంలో విడుదల చేసింది. బీఎండబ్ల్యూ ఫ్లాగ్‌షిప్ సెడాన్ పెట్రోల్, పూర్తి విద్యుత్తు మోడల్ బీఎండబ్ల్యూ ఐ7 ఎం70 కూడా అందుబాటులో ఉంటుంది. 7 సిరీస్ కార్లతో పాటు ఐ7ను కూడా గ్రూప్ చెన్నై ప్లాంట్‌లో తయారు చేస్తామని సంస్థ తెలిపింది. దీంతో జర్మనీ తర్వాత ఐ7ను స్థానికంగా తయారు చేసే దేశంగా భారత్ నిలుస్తుంది. బీఎండబ్ల్యూ ఐ7 ఎం70 మాత్రం పూర్తిగా తయారైన యూనిట్‌గా భారత్‌కు అందుబాటులోకి వస్తుందని వివరించింది. ఈ కార్లను బీఎండబ్ల్యూ ఇండియా డీలర్‌షిప్‌లలో బుక్ చేసుకోవచ్చు. డెలివరీలు 2026 అక్టోబరు నుంచి ప్రారంభం కానున్నాయి. కొత్త బీఎండబ్ల్యూ 740 ఎం స్పోర్ట్, బీఎండబ్ల్యూ ఐ7 ఇ డ్రైవ్ 50 ఎక్స్‌డ్రైవ్ ఎంస్పోర్ట్ మోడళ్ల ఎక్స్–షోరూమ్ ధర రూ.1.95 కోట్లు (ఎక్స్‌షోరూం)గా ప్రకటించింది. కొత్త బీఎండబ్ల్యూ ఐ7 ఎం70 ఎక్స్ డ్రైవ్ ధర రూ.2.65 కోట్లు. ధరలు పెంచుతాం: భారత్‌లో తన మొత్తం వాహన శ్రేణి ధరలను త్వరలో పెంచుతామని బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్, సీఈఓ హర్దీప్ సింగ్ బ్రార్ శుక్రవారం ఇక్కడ తెలిపారు. 2026లోనే మూడు దఫాల్లో కలిపి గరిష్ఠంగా 5% వరకు వాహన ధరలను పెంచినట్లు వెల్లడించారు. కమోడిటీ అధిక ధరలు, రూపాయి విలువ క్షీణత కారణంగా, లాభాలపై ఒత్తిడి ఏర్పడినందునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. కొత్త 7 సిరీస్‌ను ఆవిష్కరించిన బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ ను బీఎండబ్ల్యూ ఇండియాకు బ్రాండ్ వాయిస్‌గా పరిచయం చేశారు.


## ఒరాకిల్‌లో మళ్లీ లేఆఫ్స్.. ఇందుకు భారీగా నిధుల ఖర్చు!

ప్రముఖ టెక్ సంస్థ ఒరాకిల్ మళ్లీ ఉద్యోగాల కోతకు సిద్ధమవుతోంది . ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి దాదాపు 700 మిలియన్ డాలర్లు (రూ.6,688 కోట్లు) వెచ్చించనున్నట్లు తెలుస్తోంది. ఏఐ డేటా సెంటర్ల కోసం అధిక నిధులను కేటాయించడమే ఈ కోతలకు కారణం. ఈ ఏడాదిలో ఇప్పటికే దాదాపు 20 వేలకు పైగా ఉద్యోగులను కంపెనీ తొలగించడం గమనార్హం.




సంస్థ కార్యకలాపాల్లో కృత్రిమ మేధను భాగం చేయడానికి ఒరాకిల్ అధికంగా ఖర్చు చేస్తోంది. దీంతో ఆర్థిక పరమైన ఒత్తిళ్లను ఎదుర్కొంటోంది. ఈ ఏడాది కంపెనీ కర్యాకలాపాల పునర్నిర్మాణంలో భాగంగా దాదాపు 2.8 బిలియన్ డాలర్లు (రూ.26.7 వేల కోట్లు) కేటాయించింది. ఇందులో అధిక భాగం ఉద్యోగాల కోతకే నిధులు వెచ్చించింది. ఇప్పటికే 2.1 బిలియన్ డాలర్లను కేటాయించగా.. మరోసారి ఉద్యోగాల కోతకు అదనంగా 700 మిలియన్ డాలర్లను కేటాయిస్తోంది. కంపెనీ నిర్వహణ ఖర్చులను తగ్గించుకొని, లాభాల మార్జిన్లను కాపాడుకోవడానికి ఉద్యోగాల కోతలు చేపడుతోంది. ప్రపంచవ్యాప్తంగా మే నాటికి ఒరాకిల్‌లో 1,41,000 మంది ఉద్యోగులు ఉన్నారు.

## బకాయిలు చెల్లించినా.. మాల్యాపై కేసులు కొనసాగుతాయ్: ఈడీ



ముంబయి: దేశం నుంచి పరారై విదేశాల్లో తలదాచుకుంటున్న విజయ్‌మాల్యా బకాయిలు చెల్లించినా కూడా, ఆయనపై కేసులు కొనసాగుతాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తెలిపింది. మనదేశంలో న్యాయ ప్రక్రియను ఇప్పటికీ తప్పించుకుంటున్నందున.. బ్యాంకులు ఆయన ఆస్తుల నుంచి రుణాలు తిరిగి రాబట్టినంత మాత్రాన, ఆయనపై ఉన్న మనీలాండరింగ్ ఆరోపణలు రద్దు కావని బాంబే హైకోర్టుకు ఈడీ స్పష్టం చేసింది. 2020లో మాల్యా దాఖలు చేసిన పిటిషన్‌కు ప్రతిస్పందనగా ఈడీ ఈనెల 8న ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేసింది. బ్యాంకులతో తన వివాదం పరిష్కారమై, రుణాలు తిరిగి చెల్లించినందున, తనపై నమోదైన క్రిమినల్ కేసులను మూసివేయాలని మాల్యా కోరారు. రూ.14,131.6 కోట్ల విలువైన చర, స్థిర ఆస్తులను ఎస్‌బీఐ నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్షియంకు అప్పగించినా, మాల్యాపై ఉన్న మనీలాండరింగ్ ఆరోపణలు రద్దు కావని, కేసులు నిలిచిపోవని ఈడీ తెలిపింది. మాల్యా 2016 మార్చిలో భారత్‌ను విడిచిపెట్టి వెళ్లారని, దర్యాప్తు సంస్థ పలుమార్లు సమన్లు జారీ చేసినా, దర్యాప్తు అధికారుల ఎదుట హాజరు కాలేదని ఈడీ తన అఫిడవిట్‌లో పేర్కొంది. ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లు తెలిపింది. 2016 నవంబరులో మాల్యాను 'పరారీలో ఉన్న నేరస్థుడు'గా ప్రకటించడాన్ని గుర్తు చేసింది. మాల్యా భారత్‌కు తిరిగి వచ్చి ఇక్కడి కోర్టు పరిధిలో విచారణను ఎదుర్కొంటారా అని హైకోర్టు ప్రశ్నించినా, బదులు రాలేదని.. ఇప్పటికీ ఆయన ఆచూకీ తెలియడం లేదని ఈడీ తెలిపింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద ఆస్తులను స్వాధీనం చేసుకోవడం అనేది చట్టబద్ధమైన హక్కుదారులు తమకు జరిగిన నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు ఉద్దేశించిన చట్టపరమైన విధానమని ఈడీ తెలిపింది. మూతపడిన విమానయాన సంస్థ కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కు బ్యాంకులు మంజూరు చేసిన సుమారు రూ.9,000 కోట్ల రుణాల్లో కనీసం రూ.3,500 కోట్లను మనీలాండరింగ్ చేసి, దుర్వినియోగం చేశారనే ఆరోపణలు మాల్యాపై ఉన్నాయి.

ట్రినేట్ తెలంగాణ న్యూస్

ఆదివారం సెప్టెంబర్ 13,2026

www.trinetnews.com




# మోహిని నుంచి.. ఓ చిన్న రిక్వెస్ట్

వదిన... ఒక స్వచ్ఛమైన, కల్తీ లేని వందశాతం అసలైన హారర్ సినిమా రకం మంత్రగత్తె' అంటూ కుటుంబం మొత్తాన్ని కూర్చోబెట్టి.. తన వదిన ఎలాంటిదో చెప్పి నమ్మించాలని ప్రయత్నిస్తున్నాడో వ్యక్తి. మరి అతను చెప్పేది నిజమేనా? అందరూ అది నమ్మారో లేదో తెలియాలంటే 'నయీ నవేలి' సినిమా చూడాల్సిందే. యామీ గౌతమ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రమిది. బాలాజీ మోహన్ దర్శకత్వంలో ఆనంద్ ఎల్ రాయ్, హిమాన్షు శర్మ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దసరా పండగ సందర్భంగా అక్టోబరు 16న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం 'లేడీస్ అండ్ జెంటిల్‌మెన్.. మోహిని నుంచి ఒక చిన్న రిక్వెస్ట్' అనే వ్యాఖ్యలతో తాజాగా ఈ చిత్ర అధికారిక టీజర్‌ను ఇన్‌స్టాలో విడుదల చేసింది. ఇందులో 'మంత్రగత్తెనా? అంతేనా? ఇద్దరు మంత్రగత్తెలు, ముగ్గురు రాక్షసులు, నాలుగు దెయ్యాలని అల్పాహారంగా తింటాను.. లేడీస్ అండ్ జెంటిల్‌మెన్ థింక్ బిగ్' అంటూ యామీ చెప్పిన డైలాగులు, సరికొత్త అవతారంలో భయపెట్టిన తీరు ఆసక్తిని రేకెత్తించాయి. ఈ చిత్రంలో ఒక సాధారణ కుటుంబ ప్రపంచాన్ని తలకిందులు చేసే కోడలు మోహిని పాత్రలో ప్రేక్షకుల్ని అలరించనుంది యామి.

# రివ్యూలతో సినిమాను పడగొట్టండి చూద్దాం..: 'స్పిరిట్' నిర్మాత సవాల్



రివ్యూలతో సినిమాల స్థాయిని తగ్గించలేరని నిర్మాత ప్రణయ్ రెడ్డి అన్నారు. ఆయన నిర్మించిన 'రోమాంచకం' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. ఈ సినిమాపై వచ్చిన విమర్శల గురించి మాట్లాడిన ప్రణయ్.. ఒక ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం వెనక ఎంతో మంది కష్టం ఉంటుందని తెలిపారు. తాను నిర్మాతగా వ్యవహరిస్తోన్న అప్‌కమింగ్ చిత్రం 'స్పిరిట్' గురించి ఆయన ఓ ఇంటర్వ్యూలో ప్రస్తావించారు."నిర్మాణ రంగంలో ఉన్నవారికే.. ఆ కష్టాలు తెలుస్తాయి. రైటర్ రాసిన కథను తెరపైకి తీసుకురావడానికి దర్శకుడు ఎంత కష్టపడతాడో, షూటింగ్ సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తుతాయో అందరికీ అర్థం కావు. 'రోమాంచకం' సినిమా రివ్యూ విషయంలో కొందరు కోడిగుడ్డు మీద ఈకలు పీకినట్లు వ్యవహరించారు. వారికి నిజంగా అంత సామర్థ్యం ఉంటే.. రాబోయే 'స్పిరిట్' స్థాయిని తగ్గించగలరా?" అని ప్రణయ్ సవాల్ విసిరారు. హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రానున్న 'స్పిరిట్' విడుదలకు ముందే వార్తల్లో నిలుస్తోంది. మొదట ఈ సినిమాకు దీపికను ఎంపిక చేశారు. ఈ ప్రాజెక్ట్ కోసం దర్శకుడు సందీప్ ఆమెతో ఏడాదిన్నర వర్క్ చేశారు. ఆ తర్వాత దీపిక స్థానంలోకి త్రిప్తి దిమ్రీని తీసుకున్నారు. ఆ సమయంలో దీపిక ఈ కథను లీక్ చేశారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారి తీశాయి. ప్రభాస్ హీరోగా సందీప్ వంగా రూపొందిస్తోన్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 5న విడుదల కానున్న విషయం తెలిసిందే

# చిక్కుముడిని విప్పాలంటే 'షాక్' ఒక్కటే మార్గం





"నువ్వు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా నేను నీకు తోడుగా ఉంటాను. నిన్ను ఎప్పుడూ జాగ్రత్తగా చూసుకుంటాను. అమ్మ నిన్ను ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటుంది" అంటూ 'షాక్: ట్రస్ట్ నో వన్' ప్రపంచాన్ని పరిచయం చేసింది సిరీస్‌బృందం. బాలీవుడ్ కథానాయిక పరిణీతి చోప్రా ప్రధాన పాత్రలో రూపొందిన సిరీస్ ఇది. సప్న మల్హోత్రా, సిద్ధార్థ్ పి.మల్హోత్రా సంయుక్తంగా నిర్మించారు. ఈ సిరీస్‌లో జెన్నిఫర్ వింగెట్, అనూప్ సోనీ, సుమిత్ వ్యాస్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సిరీస్ ఈ నెల 24 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానుంది. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల వేదికగా ట్రైలర్‌ను విడుదల చేసింది సిరీస్ బృందం. "ఈ చిక్కుముడిని విప్పడానికి 'షాక్' తప్ప వేరే మార్గం లేదు" అనే వ్యాఖ్యను జోడించింది. "ఆపేక్ష ఎనిమిదేళ్ల క్రితం అదృశ్యమైంది. వాళ్లు ఆమె కోసం వెతుకుతున్నారు. మీ ఊహకు, వాస్తవానికి మధ్య ఉన్న తేడా మీకు అర్థమవుతోందా? ఎవరో మిమ్మల్ని పిచ్చిదానిలా మార్చడానికి ప్రయత్నిస్తున్నారు" అనే సంభాషణలతో సాగుతున్న ట్రైలర్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది.




# ఆ మార్పునకు సిద్ధంగా ఉన్నా!

"బిడ్డ పుట్టడం వల్ల జీవితం మారిపోతుందని అందరూ చెబుతారు. నేను ఆ మార్పుని స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాన"ని అంటోంది కథానాయిక సమంత. ఇటీవలే 'మా ఇంటి బంగారం' చిత్రంతో విజయాన్ని అందుకున్న ఆమె.. త్వరలో తల్లి కాబోతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సమంత తన జీవితంలోని కొత్త దశ గురించి ఆసక్తికరమైన సంగతుల్ని తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. "తస్సాదియ్యా' పాట చిత్రీకరణలో గర్భవతినని తెలిసింది. ఆ సమయంలో కొంచెం అనారోగ్యంగా ఉన్నప్పటికీ చిత్రీకరణని కొనసాగించాం. ఇప్పుడా సందర్భాన్ని వెనక్కి తిరిగి చూసుకున్నా సహజంగానే కుదిరినట్లు అనిపిస్తుంది. బిడ్డ పుట్టడం 'మీ జీవితాన్ని పూర్తిగా మార్చేస్తుంది' అని అందరూ చెప్పే మాటను నేను నిజంగా నమ్ముతాను. దానిని ఆస్వాదించడానికి కూడా సిద్ధంగా ఉన్నాను. వృత్తి పరంగా కొంత కాలం విరామం తీసుకున్నప్పటికీ నా శరీరం చెప్పే దానిపైనే దృష్టి పెడతాను. బాధ్యతల నుంచి పూర్తిగా తప్పుకోవడం లేదు. మా నిర్మాణ సంస్థలో కొత్త ప్రతిభని ప్రోత్సహిస్తూ.. మరెన్నో చిత్రాలు రాబోతున్నాయి. వాటికి అవసరమైన సమయాన్ని కేటాయిస్తూనే అన్నింటినీ బ్యాలెన్స్ చేసుకుంటాను. భవిష్యత్తులో కూడా బలమైన మహిళా ప్రాధాన్య పాత్రలు కలిగిన చిత్రాలొస్తాయి" అని చెప్పింది.



# తెలుగులోకి హనుమాన్ అంశ్

ఎలాంటి అంచనాల్లేకుండా ఓ చిన్న సినిమాగా విడుదలై.. ఉత్తరాదిలో సంచలన విజయాన్ని అందుకున్న సినిమా 'హనుమాన్ అంశ్'. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా జీవితాధారంగా రూ.2కోట్ల బడ్జెట్‌తో నిర్మితమైన ఈ చిత్రం.. బాక్సాఫీస్ వద్ద రూ.150కోట్ల వసూళ్లు రాబట్టి రికార్డులు సృష్టించింది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడీ సినిమాని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సిద్ధమయ్యారు దర్శకుడు త్రివిక్రమ్. ఆయన సమర్పణలో దీన్ని ఈ నెల 18న తెలుగులో విడుదల చేయనున్నట్లు శుక్రవారం ప్రకటించారు. 1900–1973 మధ్య కాలంలో జీవించిన ఆధ్యాత్మిక గురువు, హనుమాన్ భక్తుడు నీమ్ కరోలి బాబా జీవితం.. ఆయన చేసిన బోధనల ఆధారంగా విశాల్ చతుర్వేది ఈ చిత్రాన్ని రూపొందించారు. శోభిత్ శ్రీవాత్సవ ప్రధాన పాత్ర పోషించారు. చందన్ ఆనంద్, పూర్ణిమ తివారి తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

# సమకాలీనం
మన జీవితానికి దగ్గరగా...

శనివారం, 26 ఏప్రిల్ 2025

వ్యాపారం • జీవితం • సమాజం

# ఓ సంస్థా... వెళ్లొస్తా!

## స్వప్నం నుంచి వీడ్కోలు వరకు...

ఒక్కో వ్యవస్థాపకుడి కథ వెనుక వేల భావోద్వేగాలు..!




ఒక కంపెనీని స్థాపించడం సులభం. దాన్ని నడపడం మరింత సులభమే. కానీ విస్తరించడం మాత్రం పెద్ద సవాలు. నిధులు, ఒత్తిళ్లు, ఇన్వెస్టర్ల అంచనాలు... ఇన్ని మధ్య వ్యవస్థాపకుడి ప్రయాణం ఒక దశలో విడిపోవడమూ తప్పదు. ఇదే 'ఫౌండర్-ఎగ్జిట్'.



ఈ విడిపోవడం కొన్నిసార్లు అనివార్యం, కొన్నిసార్లు వ్యూహాత్మకం, మరికొన్నిసార్లు... అవమానకరం కూడా.

### ఎందుకు ఎగ్జిట్?

- **నిధుల కొరత:** వృద్ధి కోసం మరిన్ని పెట్టుబడుల అవసరం
- **ఇన్వెస్టర్ల ఒత్తిడి:** తక్షణ ఫలితాల అంచనాలు
- **అభిప్రాయ భేదాలు:** వాటాలు, పదవుల పంపకాలపై
- **అవమానాలు:** సంస్థలో గౌరవం తగ్గడం
- **ఒప్పందాల షరతులు:** కొన్ని దశల్లో స్వేచ్ఛాయుతంగా తప్పుకోవడం

### ఇంతలోనే ఎంత తేడా!



ఇప్పటి వరకు 'గుడ్ మార్నింగ్ సార్!' అన్న సెక్యూరిటీ... ఇప్పుడు 'అపాయింట్‌మెంట్ ఉందా?' అంటాడు.




రిసెప్షనిస్ట్ కూడా పట్టించుకోనట్లే ప్రవర్తిస్తుంది. ఫోన్ కాల్ రిసీవ్ చేసుకునే సాకుతో తల పక్కకి తిప్పుకుంటుంది.



ఇద్దరేనా, వందలాది ఉద్యోగుల ప్రవర్తనలో మార్పు కనిపిస్తుంది.

"'మీరే మాకు ఇన్స్పిరేషన్ సార్!' అన్నవారే... ఇప్పుడు పలకరించడానికి కూడా ఇబ్బంది పడతారు."



స్వప్నాలు ఒక దశలో ముగిసినా... ప్రయాణం ముగియదు!

కానీ గుర్తుంచుకోండి... ఒక్కో ఎగ్జిట్ వెనుక... ఒక కథ ఉంటుంది. ఆ కథలో విజయం, బాధ, అనుభవం, పాఠాలు అన్నీ కలిసే ఉంటాయి.



Fall... Learn... Rise...



# వినాయక విగ్రహం కొనే ముందు, ప్రతిష్టించే ముందు

## ఈ విషయాలు తెలుసుకోండి..!

## పూజలు ఫలిస్తాయి..

సంప్రదాయాలు, సంతోషాల కలబోత అయిన **వినాయక చవితి పండుగ** వచ్చేస్తోంది! ఈ సంవత్సరం సెప్టెంబర్ 14న గణేష్ చతుర్థి నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. ప్రతి ఇంటోనూ బొజ్జ గణపయ్యను కొలువుదీర్చి, 9 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజించడం ఆచారం. అయితే వినాయకుడిని ఇంటికి తెచ్చుకునే ముందు కేవలం అలంకరణ మాత్రమే కాకుండా వాస్తు, జ్యోతిష్య నిబంధనలను పాటించడం కూడా చాలా ముఖ్యం......

గణేష్ చతుర్థి శుభాకాంక్షలు

ఈ సంవత్సరం
సెప్టెంబర్
14
గణేష్ చతుర్థి
నవరాత్రుల ప్రారంభం

### వినాయకుడిని ఇంటికి తెచ్చుకునే ముందు

- **విగ్రహం ఎంపిక:** మట్టి విగ్రహాన్ని ఉపయోగించడం పర్యావరణానికి మేలు. శుభ్రమైన, సంపూర్ణమైన విగ్రహాన్ని ఎంచుకోండి.
- **వాస్తు దిశ:** వినాయకుడిని ఇంట్లో ఉత్తర దిక్కు లేదా ఈశాన్య దిశలో ప్రతిష్టిస్తే శ్రేయస్సు కలుగుతుంది.
- **జ్యోతిష్య నియమాలు:** గణేష్ చతుర్థి రోజున, శుభ ముహూర్తంలో ప్రతిష్టించడం అత్యంత శుభప్రదం.
- **శుభ్రత & అలంకరణ:** విగ్రహాన్ని శుభ్రంగా ఉంచండి. పసుపు, కుంకుమ, పూలతో అలంకరించండి.
- **నిత్య పూజ:** ప్రతిరోజూ దీపారాధన, పుష్పార్చన, గణేశ్ మంత్ర జపంతో పూజ చేయండి.

# శాస్త్రీయ కళలతో వ్యక్తిత్వ వికాసం





**హైదరాబాద్, రవీంద్రభారతి ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 12:**

శాస్త్రీయ కళలు వ్యక్తిత్వ వికాసానికి, భారతీయ వారసత్వ పరిరక్షణకు, విద్యాభివృద్ధికి ఎంతో దోహదపడతాయని యక్షగాన కంఠీరవ పసుమర్తి శేషుబాబు, ప్రముఖ సంగీత విద్వాంసురాలు, ప్రొఫెసర్ డా. కె. శేషులత విశ్వనాథ్ అన్నారు. ప్రముఖ నృత్య సంస్థ నృత్యదీక్షాలయ 9వ వార్షికోత్సవం సందర్భంగా 'నృత్యార్పణం ' పేరిట శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు రవీంద్రభారతిలో నిర్వహించారు . కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పసుమర్తి శేషుబాబు పాల్గొని కె. శేషులత విశ్వనాథ్ ఐపీఎస్ , డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె. శిల్పవల్లి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. వై. లలిత సింధూరి, యక్షగాన కళాకారుడు డా. పసుమర్తి శేషుబాబు తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువతలో క్రమశిక్షణ, విలువలు, సృజనాత్మకత పెంపొందించడంలో శాస్త్రీయ నృత్యాలకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు.

1999లో లక్ష్మీ శంకర్ కళా దర్శకత్వంలో ప్రారంభమైన నృత్యదీక్షాలయ సంస్థ దాదాపు మూడు దశాబ్దాలుగా శాస్త్రీయ నృత్య కళా రంగానికి విశేష సేవలందిస్తోందని కొనియాడారు.

సభ సమన్వయకర్త వెంకట్ దీక్షితులు ప్రారంభోపన్యాసం చేశారు. సభకు ముందు కళాకారులు ప్రదర్శించిన చారిత్రక, పౌరాణిక, ఆధ్యాత్మిక అంశాలను ప్రతిబింబించే అగస్త్య మహర్షి, ఛత్రపతి శివాజీ, శ్రీరామకృష్ణ పరమహంస, రమణ మహర్షి వంటి మహనీయుల జీవితాలు, భావజాలాన్ని నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి.

# గుండె కండరాలకి... దానిమ్మ



కొంతమందికి కాస్త నడిచినా ఆయాసం వస్తుంది, త్వరగా అలసిపోతుంటారు. దీనికి 'డయాస్టొలిక్ హార్ట్ ఫెయిల్యూర్' అనే సమస్య కూడా ఒక కారణం కావొచ్చు. ఇది ఉన్నవారిలో గుండె కండరాలు గట్టిపడి, అవి గుండెలోపలికి రక్తాన్ని మోసుకెళ్లలేక ఇబ్బంది పడుతుంటాయి. ఈ సమస్యకు దానిమ్మ గింజలు 80శాతం పరిష్కారం చూపిస్తున్నాయని అంటున్నారు యూకేకి చెందిన కింగ్స్ కాలేజ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. అదెలా అంటే... మనం దానిమ్మ గింజలని తిన్నప్పుడు జీర్ణవ్యవస్థలోని బ్యాక్టీరియా ఆ పదార్థాన్ని విచ్ఛిన్నం చేసి 'యూరోలిథిన్- ఏ' అనే రసాయన సమ్మేళనంగా మారుస్తుందట. ఈ యూరోలిథిన్-ఏ మన శరీరంలోని పీకేజీ1అల్ఫా అనే ప్రొటీన్‌ని చురుగ్గా మారుస్తుంది. ఈ ప్రొటీన్ కనుక చురుగ్గా ఉంటే గట్టిగా, బిరుసుగా మారిన గుండె కండరాలు మృదువుగా మారి రక్తాన్ని మునుపటిలా పంప్ చేస్తాయి. అలాగే గుండెలో వచ్చే వాపుని కూడా ఈ ప్రొటీన్ సమర్థంగా అడ్డుకుంటుందట. దానిమ్మ తర్వాత వాల్‌నట్లూ, స్ట్రాబెర్రీలకు కూడా ఈ ప్రొటీన్‌ని చురుగ్గా ఉంచి గుండెజబ్బులని రాకుండా చేసే శక్తి ఉందని శాస్త్రవేత్తలు అంటున్నారు.

# అపురూపం ఖ్యాతి పుట్ట కూచిపూడి రంగ ప్రవేశం





**హైదరాబాద్, రవీంద్ర భారతి, ట్రైనెట్ న్యూస్ సెప్టెంబర్ 12:**

ప్రముఖ నాట్య గురు బొంపల్లి సుధీర్ రావు శిష్యురాలు ఖ్యాతి పుట్ట కూచిపూడి రంగ ప్రవేశం సద్గురు శివానంద నృత్యమాల అకాడమీ (వరంగల్ ) ఆధ్వర్యంలో శిల్పకళా వేదిక ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పద్మశ్రీ సినీ నటుడు మురళీమోహన్, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాల పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రవి పుట్ట రాణి దంపతులు ఖ్యాతి పట్టుదలతో కూచిపూడి నృత్యంలో రాణించడం అభినందనీయమన్నారు. కూచిపూడి రంగంలో ప్రసిద్ధి చెందినగురు బొంపల్లి సుధీర్ రావు వద్ద 2024 సంవత్సరంలో శిక్షణ ప్రారంభించి కళ రంగంలో దొరికిన ప్రతి అవకాశంలో అంకితభావంతో తన శిక్షణను కొనసాగించిందన్నారు. రంగ ప్రవేశం కేవలం నేర్చుకున్న అంశాల ప్రదర్శన మాత్రమే కాదని కొనసాగుతున్న ప్రయాణంలో ఒక మైలురాయి మాత్రమేనన్నారు.

ఖ్యాతి గీతం యూనివర్సిటీలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతూ .. కళా రంగంలో రాణించడం సంతోషంగా ఉందన్నారు. చదువుతోపాటు నృత్యం, కర్ణాటక సంగీతం, టెన్నిస్ రంగాలలో రాణిస్తుందని తెలిపారు. గురు బొంపల్లి సుధీర్ రావు వరంగల్ లో 40 సంవత్సరాల క్రితం పది మంది విద్యార్థులతో అకాడమిని స్థాపించి దాదాపు 600 మంది విద్యార్థులు కూచిపూడి రంగంలో రాణించారని పేర్కొన్నారు. అనేకమంది విద్యార్థులు సిసిఆర్టి స్కాలర్ షిప్

8 మంది విద్యార్థులు మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ నుండి స్కాలర్ షిప్ పొందుతున్నారని తెలిపారు. సభకు ముందు ఖ్యాతి ప్రదర్శించిన గజవదన, ఎందరో మహానుభావులు, భామ కలాపం, శంకర శ్రీగిరి, జయ జయ దుర్గే తదితర అంశాలు ఆకట్టుకున్నాయి.

# శ్రీముష్ణం వరాహమూర్తి... ముస్లింలకు వరాహ సాహెబ్!

నిత్యం వినిపించే పురుష సూక్తం... భిన్నంగా ఉండే మూలమూర్తి రూపం... హిందువులతోపాటు ముస్లింలూ కొలిచే దైవం... శ్రీముష్ణం భూ వరాహస్వామి. దేశంలోని ఎనిమిది స్వయంవ్యక్త క్షేత్రాల్లో ఒకటైన ఈ మహిమాన్విత ఆలయంలో స్వామి కొలువైన తీరు ఆసక్తికరం.

శ్రీముష్ణం... ఇక్కడ దర్శనమిచ్చే భూ వరాహస్వామిని పూజిస్తే త్వరగా కల్యాణం జరుగుతుందనీ, సత్సంతానం కలుగుతుందనీ, భూ వివాదాలూ- వాస్తుదోషాలూ తొలగిపోతాయనీ, సొంతింటి కల నెరవేరుతుందనీ ఓ విశ్వాసం. ఏడు అంతస్తుల రాజగోపురంతో భక్తులను స్వాగతించే ఈ ఆలయం తమిళనాడు, కడలూరు జిల్లాలోని శ్రీముష్ణంలో ఉంది. దేశంలోని ఎనిమిది స్వయంవ్యక్త వైష్ణవ క్షేత్రాలలో - శ్రీరంగం, తిరుమల, వానమామలై, ముక్తినాథ్, పుష్కర్, బద్రినాథ్, నైమిశారణ్యంతోపాటు శ్రీముష్ణం కూడా ఒకటిగా ప్రసిద్ధిపొందింది.

**స్థలపురాణం**

హిరణ్యాక్షుడు అనే అసురుడు... భూదేవిని అపహరించి, రసాతలంలోకి వెళ్లిపోయాడట. అప్పుడు భూమాత శ్రీమహావిష్ణువును ప్రార్థించడంతో స్వామి వరాహమూర్తిగా అవతరించి, ఆ అసురుడిని సంహరించి, భూదేవిని రక్షించాడు. హిరణ్యాక్షుడు చనిపోతూ తనని అనుగ్రహించమని కోరడంతో స్వామి ఆ అసురుడిని చూసేందుకు దక్షిణంవైపు తల తిప్పాడట. తర్వాత అలాగే స్వయంభువుగా శ్రీముష్ణంలో ప్రకటితమయ్యాడనేది పురాణ కథ. అందుకే ఈ క్షేత్రంలో స్వామి శిరస్సు దక్షిణంవైపు తిరిగి ఉంటే, మిగతా భాగం పశ్చిమంవైపు ఉంటుంది. స్వామి దేవేరి అయిన లక్ష్మీదేవి అంబుజవల్లిగా కొలువైన ఈ ఆలయాన్ని తంజావూరు రాజులు నిర్మించారు.

**ఐక్యతకు నిదర్శనంగా...**

రాజగోపురాన్ని దాటి లోపలికి వెళ్లే భక్తులకు గర్భాలయంలో స్వామిదర్శనం ఇచ్చే తీరు ఆసక్తికరమైతే... ఇక్కడ ఉండే పదహారు స్తంభాల మండపం, అద్దాల మండపం, పుష్కరిణి మరింత ఆకట్టుకుంటాయి. అభిషేక సమయాన ఈ పదహారు స్తంభాల మండపంలో పఠించే పురుషసూక్తం ఆలయ ప్రాంగణంలో మార్మోగుతుంది. ఇక, ఏడాదికి రెండుసార్లు జరిగే విశేష ఉత్సవాలు హిందూ-ముస్లిం ఐక్యతకు నిదర్శం. ముస్లింలు స్వామిని వరాహ



సాహెబ్‌గా పిలుస్తారిక్కడ. ఒకానొకప్పుడు ఈ ప్రాంతాన్ని పాలించే నవాబు చర్మ సమస్యలతో బాధపడేవాడు. ఎంతోమంది వైద్యులకు చూపించినా నయం కాకపోవడంతో చివరకు స్వామిని దర్శించుకున్నాడట. చర్మ సమస్యలు తొలగిపోయి, ఆరోగ్యం చేకూరడంతో ఆ నవాబు తన పేరును భూరా సాహెబ్‌గా మార్చుకోవడమే కాక, స్వామినీ వరాహ సాహెబ్‌గా పిలవడం మొదలుపెట్టాడట. అందుకే రథోత్సవం నిర్వహిస్తున్నప్పుడు ఆ రథానికి అలంకరించే జెండాను స్థానిక ముస్లింలే తయారుచేసి ఇస్తారు. స్వామికి కానుకల్నీ అందిస్తారు. అలాగే, ఏటా నిర్వహించే ఊరేగింపు ఈ ప్రాంతంలోని హజ్రత్ సయ్యద్ షా రహమతుల్లా దర్గా దగ్గర కాసేపు ఆగుతుంది. అప్పుడు ముస్లింలు స్వామికి డ్రైఫ్రూట్స్, బియ్యం, కొబ్బరికాయ వంటివి సమర్పిస్తే... ఆలయ అర్చకులు పట్టు శాలువా, తులసి ఆకుల్ని దర్గాకు ఇస్తారు. ఇంకా... నవరాత్రి, దీపావళి, మకర సంక్రాంతి సమయాల్లో ముస్లింలు అర్ధమండపం వరకూ వచ్చి స్వామిని పూజిస్తారు. ఇక్కడ మరో విశేషం ఏంటంటే... తిరుమలలో ముందుగా వరాహస్వామిని పూజించాకే వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటాం. కానీ, ఇక్కడ మాత్రం శ్రీనివాసుడిని దర్శించుకున్నాకే వరాహమూర్తి మందిరానికి వెళ్తారు భక్తులు. ఇతర దేవతలూ కొలువైన ఈ ఆలయంలో రామలక్ష్మణులను మోస్తున్న హనుమంతుడినీ చూడొచ్చు.

**108 ప్రత్యేకత అదే**

వేంకటేశ్వరుడు, శివుడు, అమ్మవారు, లక్ష్మి... ఇలా ఏ దేవతల అష్టోత్తరనామాలను తీసుకున్నా 108 ఉంటాయి. మన ఇష్టదైవాన్ని అలా 108 పేర్లతో అష్టోత్తర శతనామావళి రూపంలో అర్చించడం వెనుక ఆసక్తికరమైన అంశాలూ, ఆధ్యాత్మిక, ఆరోగ్య, జ్యోతిష పరమైన కారణాలూ దాగుతున్నాయి. అష్ట అంటే 8 అనీ, శతం అంటే 100 అనీ అర్థం. వీటిని కలిపితే 108 అవుతాయి. హిందూ జ్యోతిష శాస్త్రంలో జీవితాన్నీ భూమినీ ప్రభావితం చేసేవి 27 నక్షత్రాలు. ప్రతి నక్షత్రానికీ నాలుగు పాదాలు ఉంటాయి. ఆ రెండింటినీ గుణిస్తే 108 వస్తుంది. అలాగే, విశ్వంలో 12 రాశులు 9 గ్రహాలు ఉంటాయి. ఈ రెండింటినీ గుణించినా అదే సంఖ్య వస్తుంది. కాబట్టి, 108 నామాలతో భగవంతుడిని పూజిస్తే విశ్వంలోని సమస్త నక్షత్రాల దోషాలూ తొలగిపోతాయనీ, గ్రహాల అనుగ్రహం కలుగుతుందనీ చెప్పడమే దీని వెనుకున్న పరమార్థం. ఇక, యోగ శాస్త్రాన్ని తీసుకుంటే... మానవ శరీరంలో 72,000 నాడులు ఉంటాయి. ఈ నాడులన్నీ కలిసే ప్రధాన కేంద్రాలను చక్రాలుగా పిలుస్తారు. మన శరీర కేంద్రబిందువైన హృదయ చక్రం వద్ద 108 ప్రాణ నాడులు కలుస్తాయి. వీటి ప్రవాహం సక్రమంగా ఉన్నప్పుడే మనిషి శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటాడు. అలా, 108 పేర్లతో భగవంతుడిని కీర్తించినా భగవన్నామాన్ని జపించినా ఆ 108 నాడులు ఉత్తేజితమై, మానసిక ప్రశాంతతా శారీరక ఆరోగ్యమూ లభిస్తుందని సైన్స్ చెబుతోంది.




ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
సాంస్కృతికం



# ఈ రోజు శ్రీ త్యాగరాయగానసభ లో జరిగిన కార్యక్రమాలు

**హైదరాబాద్, చిక్కడపల్లి,ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 12 :** ఈ కార్యక్రమాలు అనికూడా trinet live మరియు ganasabha tv యూట్యూబ్ ఛానెల్ లో ప్రత్యక్ష ప్రసారం జరిగాయి










































edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136